ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -101 పేజీలు - 08 వెల - 04/- శనివారం 25 జనవరి 2025

## రాజకీయాలకు గుడ్ బై...

వైకాపాలో విజయసాయి రాజకీయ కలకలం

రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటన

రాజ్యసభకు కూడా రాజీనామా చేస్తున్నట్లు వెల్లడి

తనను ఆదరించిన జగన్‌కు కృతజ్ఞతలు వెల్లడి 2లో



# ప్రణాళికలతో సిద్ధంగా ఉండండి

### దావోస్ చర్చలు కార్యరూపం దాల్చేలా అధికారులకు చంద్రబాబు ఆదేశాలు

ముగిసిన చంద్రబాబు దావోస్ పర్యటన

నేరుగా అర్ధరాత్రి ఢిల్లీకి చేరిక

కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్‌తో భేటీ

సాయంత్రం విజయవాడకు చేరుకున్న సిఎం

దావోస్ ప్రతిపాదనలు ముందుకు తీసుకెళ్లడంపై చంద్రబాబు ఫోకస్

దావోస్ చర్చలతో త్వరలో రాష్ట్రానికి దిగ్గజ సంస్థల సీఈఓలు, ప్రతినిధులు

ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండాలని సీఎస్‌కు సూచన



అమరావతి,జనవరి 24 ఆంధ్ర ప్రగతి : దావోస్ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయా సంస్థలతో జరిగిన చర్చలు,



ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడంపై దృష్టి పెట్టారు. దావోస్ లో తాము జరిపిన పెట్టుబడుల చర్చలు కార్యరూపం దాల్చేలా ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సాయంత్రం గన్నవరం విమానాశ్రయం నుంచి ఉండవల్లి నివాసానికి చేరుకున్న చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీఎంఓ అధికారులతో దావోస్ పర్యటనపై చర్చించారు. మూడు రోజుల పాటు ఆయా కంపెనీల సీఈఓలు, ఛైర్మన్‌లు, ప్రతినిధులతో వివిధ రంగాల్లో పెట్టుబడులపై జరిపిన చర్చలను అధికారులకు వివరించారు. మౌలిక సదుపాయాలు, మారిటైం హబ్, ఏఐ యూనివర్సిటీ, జీసీసీ, డేటా సెంటర్, ఫుడ్ ప్రాసెసింగ్, కోర్ ఇంజనీరింగ్, మిగతాది 2లో...

## బనకచర్ల విషయంలో హరీశ్ రావు చేసిన ఆరోపణలు సరికాదు



2లో

ఏపీ చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై స్పందించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి

బీఆర్ఎస్ హయాంలో నదీజలాల విషయంలో నష్టం జరిగిందన్న ఉత్తమ్

బీఆర్ఎస్ హయాంలో జరిగిన నష్టాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడి

బనకచర్లపై అభ్యంతరాలు తెలుపుతూ నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసినట్లు వెల్లడి

# అటవీ శాఖలో సమూల మార్పులపై పవన్ కల్యాణ్ దృష్టి

### అధికారులకు కీలక ఆదేశాలు

### శాఖలో ఉన్న సమస్యలు, పరిష్కారం మార్గాలపై నివేదిక సిద్ధం



**అమరావతి,**జనవరి 24 ఆంధ్ర ప్రగతి : గత ఆరు నెలలుగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై పూర్తి స్థాయిలో దృష్టి నిలిపి, గ్రామీణ పాలన, క్షేత్రస్థాయి పర్యటనలు, అభివృద్ధి, సంస్కరణలతో తనదైన ముద్ర వేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తాజాగా తన పరిధిలోని అటవీశాఖలో సమగ్ర మార్పుల మీద దృష్టి సారించారు. రాష్ట్ర అటవీశాఖకు ఎదురవుతున్న సవాళ్లను, శాఖాపరంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ ప్రాధాన్య క్రమంలో మార్పులు తీసుకురావాలని భావిస్తున్నారు. దశాబ్దాలుగా అటవీ శాఖలో ఉన్న సమస్యలు, పరిష్కారం మార్గాలపై సత్వరమే నివేదిక సిద్ధం చేయాలని శాఖ పి.సి.సి.ఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్‌లను ఆయన ఆదేశించారు. గత కొన్నాళ్లుగా అటవీ శాఖ సరైన ప్రగతిని సాధించలేకపోయిందని ఆయన గుర్తించారు. మిగతాది 2లో...

## వక్ఫ్ సవరణ జెపిసిలో గందరగోళం

### సమావేశం నుంచి విపక్ష ఎంపి సస్పెన్షన్

న్యూఢిలీజనవరి 24 ఆంధ్ర ప్రగతి : వక్ఫ్ సవరణ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ సమావేశంలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో 10 మంది విపక్ష ఎంపీలపై ఒక రోజు పాటు సస్పెన్షన్ వేటు వేయడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎంపీలు.. కమిటీ కార్యకలాపాల తీరు పట్ల లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేశారు. పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ జగదాంబికా పాల్ తమను ఉద్దేశ పూర్వకంగానే సస్పెండ్ చేశారని స్పీకర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. అప్పటి వరకు ఫోన్‌లో మాట్లాడిన జగదాంబికా పాల్ ఉన్నట్టుండి తమను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. కార్యకలాపాలు సజావుగా సాగేలా కమిటీ ఛైర్మన్‌ను ఆదేశించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.

## అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తాం

ఇప్పటి వరకు 40 పనులకు టెండర్లు పిలిచామన్న నారాయణ

టాప్ 5 నగరాల్లో అమరావతి ఒకటిగా ఉండాలనేదే లక్ష్యమని వ్యాఖ్య

250 మీటర్ల ఎత్తుతో అసెంబ్లీని నిర్మిస్తామన్న మంత్రి

అమరావతి,జనవరి 24 ఆంధ్ర ప్రగతి : ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజధాని అమరాతి నిర్మాణం పునఃప్రారంభమయింది. రాజధాని నిర్మాణం పనులను పరుగులు పెట్టించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తాజాగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... మిగతాది 2లో...



## బ్రాండ్ ఏపీ పునరుద్ధరణ లక్ష్యంగా సాగిన లోకేశ్ దావోస్ పర్యటన

డబ్ల్యూఈఎఫ్ వేదికపై ఆంధ్రప్రదేశ్ అంతరంగాన్ని ఆవిష్కరించిన యువగళం

30మందికి పైగా గ్లోబల్ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి భేటీలు

8 రౌండ్ టేబుల్ సమావేశాలు, 9మంది అంతర్జాతీయ నిపుణులతో చర్చలు

అమరావతి,జనవరి 24 ఆంధ్ర ప్రగతి : బ్రాండ్ ఏపీ పునరుద్దరణే లక్ష్యంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం వేదికపై యువనేత, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తమ గళాన్ని వినిపించారు. దావోస్ లో విజయవంతంగా తన పర్యటన పూర్తి చేసుకుని నేడు స్వదేశానికి బయలుదేరారు. దావోస్ వేదికగా నాలుగు రోజులపాటు జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో 30 మందికి పైగా గ్లోబల్ పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేశ్ ముఖాముఖి భేటీ అయ్యారు. మిగతాది 2లో...



## టిడిఎస్ పథకం రద్దు కోరుతూ పిటిషన్

తిరస్కరించిన సుప్రీంకోర్టు


2లో

## ఏపీకి 17వ స్థానం ,తెలంగాణకు 8వ స్థానం

### 2022-23 ఆర్థిక ఆరోగ్య డేటా విడుదల చేసిన నీతి ఆయోగ్

జనవరి 24 ( రిపబ్లిక్ న్యూస్):కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిలా వ్యవహరించే నీతి ఆయోగ్ 2022-23 ఏడాదికి గాను ఆర్థిక ఆరోగ్య డేటా విడుదల చేసింది. 2022-23లో ఏపీ 17వ స్థానంలో నిలిచినట్టు నీతి ఆయోగ్ పేర్కొంది. ఆ ఏడాది ఏపీ ఆర్థిక ఆరోగ్య స్థితి అత్యంత దయనీయంగా ఉందని తెలిపింది. అదే సమయంలో తెలంగాణ 8వ స్థానంలో నిలిచిందని వెల్లడించింది. 2022-23లో పంజాబ్ మినహా మిగతా రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య స్థితి బాగుందని వివరించింది. రాష్ట్రాల రెవెన్యూ సమీకరణ, వ్యయం, అప్పులు, చెల్లింపుల సామర్థ్యం తదితర అంశాల ప్రాతిపదికగా నీతి ఆయోగ్ ఈ నివేదిక రూపొందించింది. 16వ ఆర్థిక సంఘం చైర్మన్ ఈ నివేదికను విడుదల చేశారు.




## జన్మతః పౌరసత్వ రద్దుపై ట్రంప్‌కు కోర్టు షాక్!

ప్రమాణ స్వీకారం చేస్తూనే జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తూ ట్రంప్ ఆదేశాలు

వీటిని సవాలు చేస్తూ కోర్టులను ఆశ్రయించిన 22 రాష్ట్రాలు

ట్రంప్ ఆదేశాలను తాత్కాలికంగా పక్కనపెట్టిన సియాటిల్ కోర్టు

జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తూ ప్రపంచాన్ని నిర్ఘాంతపరిచిన అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సియాటిల్ ఫెడరల్ కోర్టు షాకిచ్చింది. ట్రంప్ ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ వాటిని తాత్కాలికంగా నిలిపివేసింది మిగతాది 2లో...



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తాం: మంత్రి నారాయణ

(మొదటి పేజి తరువాయి)

మూడేళ్లలో అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. న్యాయపరమైన ఇబ్బందుల కారణంగా పనుల ప్రారంభం ఆలస్యమయిందని తెలిపారు. మంత్రి నారాయణ ఈరోజు రాజధాని ప్రాంతంలో పర్యటించారు. నేలపాడు సమీపంలోని అడ్మినిస్ట్రేటివ్ టవర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఇప్పటి వరకు 40 పనులకు టెండర్లను పిలిచామని నారాయణ తెలిపారు. అమరావతిని ప్రపంచ టాప్ 5 నగరాల్లో ఒకటిగా చేయాలనే లక్ష్యంతో ఐకానిక్ భవనాల నిర్మాణానికి నార్మన్ ఫోస్టర్ చేత డిజైన్ చేయించామని వెల్లడించారు. 2019కి ముందే టీడీపీ హయాంలో జడ్జ్ లు, అధికారులు, ఉద్యోగుల కోసం మొత్తం 4,053 ఫ్లాట్ లతో అపార్ట్ మెంట్ల పనులు ప్రారంభించామని తెలిపారు. అసెంబ్లీని 250 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తామని... సమావేశాలు లేని రోజుల్లో దాన్ని టూరిజం స్పాట్ గా మార్చేలా డిజైన్లు రూపొందించామని చెప్పారు. తాగునీటి పైపులు, విద్యుత్ లైన్లు, డ్రైనేజీలు అండర్ గ్రౌండ్ లో ఉండేలా చేస్తున్నామని తెలిపారు.

# జన్మతః పౌరసత్వ రద్దుపై ట్రంప్‌కు కోర్టు షాక్!

(మొదటి పేజి తరువాయి)

. ఈ నెల 20న అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తూనే ట్రంప్ పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. పలు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీచేశారు. వాటిలో జన్మతః పౌరసత్వ రద్దు కూడా ఒకటి. ట్రంప్ ఆదేశాలపై అమెరికా వ్యాప్తంగా కలకలం రేగింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ అమెరికాలోని 22 రాష్ట్రాలు కోర్టులను ఆశ్రయించాయి. ట్రంప్ ప్రత్యర్థి పార్టీ డెమొక్రాట్ల నేతృత్వంలోని వాషింగ్టన్, అరిజోనా, ఇల్లినాయిస్, ఒరెగాన్ రాష్ట్రాలు సియాటిల్ ఫెడరల్ కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని వాదించాయి. ఈ నేపథ్యంలో న్యాయస్థానం ఆ ఆదేశాలను తాత్కాలికంగా పక్కనపెడుతూ ఆదేశాలు జారీచేసింది.

## మళ్లీ విజృంభిస్తున్న మంకీ ఫాక్స్ వైరస్..

# బెంగళూరులో తొలి కేసు నమోదు



బెంగళూరుజనవరి 24 ఆంధ్ర ప్రగతి :
బెంగళూరు : కొత్త ఏడాది ప్రారంభమై నెల రోజులు గడవక ముందే బెంగళూరులో తొలి మంకీ ఫాక్స్ పాజిటివ్ కేసు నమోదైంది. దుబాయ్ నుంచి వచ్చిన 40 ఏళ్ల వ్యక్తికి %వీజూశీఞ% పాజిటివ్ నిర్ధారనైంది. ప్రస్తుతం అతడిని విక్టోరియా ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. దుబాయ్ నుంచి బెంగళూరు విమానంలో వచ్చిన అతడి కాంటాక్ట్ లిస్ట్‌ను అధికారులు ట్రాక్ చేసే పనిలో పడ్డారు. ఈ వైరస్ వేగంగా వ్యాప్తి చెందకుండా అన్ని నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.గతేడాది ఆఫ్రికాలోని సుమారు 15 దేశాలు ఈ ప్రాణాంతక ఇన్‌ఫెక్షన్‌తో పోరాడాయి. దీంతో 2024 ఆగస్టు మధ్యలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. కాగా మంకీ వైరస్ మొదటిసారి సెప్టెంబర్ 2023లో కాంగోలో బయటపడింది. స్వీడన్, థాయ్‌లాండ్‌తో సహా పలు దేశాల్లో ఈ వైరస్ కేసులు వేగంగా వ్యాప్తి చెందాయి.ఇటీవల, బ్రిటన్ ఆరోగ్య భద్రతా ఏజెన్సీ కూడా ఇంగ్లాండ్‌లో మరో వేరియంట్ క్లాడ్ %×ఎ% కేసు నమోదైనట్లు నివేదించింది. గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ దేశంలో ఇది ఆరో కేసు..

# అటవీ శాఖలో సమూల మార్పులపై పవన్ కల్యాణ్ దృష్టి

(మొదటి పేజి తరువాయి)

సమర్థత కలిగిన నాయకత్వం అటవీ శాఖకు ఉన్నప్పటికీ సరైన ఫలితాలు సాధించలేకపోయిందని, దీన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. శాఖలో పూర్తిస్థాయి మార్పుచేర్పులతో మళ్లీ అటవీశాఖను రాష్ట్ర అవసరాల్లో, అభివృద్ధిలో ప్రాధాన్య స్థానంలో నిలిపేందుకు ప్రయత్నం మొదలుపెట్టారు. నూతనోత్తేజంతో, అద్భుత ప్రగతిలో అటవీ శాఖ పచ్చగా కళకళలాడాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. ఈ క్రమంలో భూముల పరిరక్షణను తొలి ప్రాధాన్యంగా తీసుకున్నారు. ముఖ్యంగా కడప అటవీ డివిజన్ పరిధిలో అటవీ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆ డివిజన్ పరిధిలో విలువైన భూములు, భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే భూములను రక్షించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

శేషాచలంలో లభ్యమయ్యే ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయడంపై పకడ్బందీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రం నుంచి వేర్వేరు మార్గాల్లో ఇతర రాష్ట్రాల సరిహద్దుల ద్వారా అక్రమ రవాణా అవుతున్న ఎర్రచందనాన్ని అరికట్టాలని భావిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లోని పోలీసులకు దొరుకుతున్న ఎర్రచందనాన్ని వారు అక్కడే వేలం వేస్తుండటంతో రాష్ట్ర ఆదాయం తగ్గుతోందని గుర్తించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ .. రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ఠమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అడవుల్లో దొరుకుతున్న నాణ్యమైన, మేలైన, అరుదుగా దొరికే అటవీ ఉత్పత్తుల నుంచి ఆదాయం పెంపుదలకు సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని భావిస్తున్నారు. గిరిజనులను దీనిలో భాగం చేసి మార్కెటింగ్ చేయడం మీద తగిన మార్గం చూపాలని భావిస్తున్నారు. దానికి కార్పొరేట్ మార్కెట్ రంగంలో ఉన్నవారి సహకారం తీసుకోనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించిన విధంగా రాష్ట్రం 50 శాతం పచ్చదనం అభివృద్ధిని సాధించే దిశగా ముందుకు వెళ్లవచ్చని అధికారులకు పవన్ సూచించారు.

అంతే కాకుండా వన్య ప్రాణుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నారు. అడవుల్లో వేటను నిషేధించి, నిఘాను పెంపొందించడంతో పాటు గిరిజనులు సైతం అటవీ ప్రాణుల రక్షణ పట్ల చైతన్యం తీసుకురావడం ప్రధానమైన అంశంగా తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సరిహద్దు ప్రాంతాల్లో మదపుటేనుగుల గుంపు సమస్యపై సమీక్షించారు. కర్ణాటక ప్రభుత్వంతో మరోసారి మాట్లాడి కుంకీ ఏనుగులను త్వరితగతిన తీసుకురావాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.

దేశం ఏటా రూ.22 వేల కోట్ల విలువైన కలప ఆధారిత దిగుమతులను చేసుకుంటున్న నేపథ్యంలో దాన్ని నివారించేందుకు అటవీ శాఖ ద్వారా దేశ అవసరాలకు తగిన కలప ఉత్పత్తులను తయారు చేసే దిశగా ఓ సమగ్రమైన ప్రణాళికను సిద్ధం చేయాలని పవన్ భావిస్తున్నారు. రాష్ట్రం నుంచి అధికంగా కలప ఉత్పత్తులు తయారు అయితే, దేశం దిగుమతి చేసుకునే ఉత్పత్తులను తయారు చేయగలిగితే అద్భుతాలు సాధించవచ్చని, 2047 నాటికి భారతదేశం కలప ఉత్పత్తులను ఎగుమతి చేసే దిశకు చేరుకోవాలని కార్యాచరణ నివేదికను రూపొందించాలని అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు.

# బ్రాండ్ ఏపీ పునరుద్ధరణ లక్ష్యంగా సాగిన లోకేశ్ దావోస్ పర్యటన

(మొదటి పేజి తరువాయి)

తొలిరోజున స్విట్జర్లాండ్ పారిశ్రామికవేత్తలు, తెలుగు డయాస్పోరా సమావేశాలకు హాజరై రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఒకవైపు గ్లోబల్ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి భేటీలు నిర్వహిస్తూనే మరోవైపు 8 రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానాలపై తమ గళాన్ని వినిపించారు. వివిధరంగాలకు చెందిన 9 మంది అంతర్జాతీయ నిపుణులతో సమావేశమై ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలపై చర్చించారు.

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రకటించిన ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు, అమలు చేస్తున్న ప్రోత్సహకాలు, పరిశ్రమలకు అనువైన పర్యావరణ వ్యవస్థ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్లీన్ ఎనర్జీ వంటి రంగాల్లో ఏపీ ప్రభుత్వ ప్రాధాన్యతలు, అందిస్తున్న ప్రోత్సాహకాలు పారిశ్రామికవేత్తలకు వివరించి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దార్శనిక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఏపీ ఏవిధంగా అభివృద్ధి పథంలో పయనిస్తుందో ప్రత్యక్షంగా వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలసి మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్, మిట్టల్ గ్రూప్ అధినేత లక్ష్మీ మిట్టల్ వంటి దిగ్గజ పారిశ్రామికవేత్తలను కలసి పారిశ్రామికాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దృక్కోణాన్ని సాక్షాత్కరించారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలిసారిగా వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన మంత్రి లోకేశ్ ఒక్కక్షణం కూడా వృధా చేయలేదు. ఒకవైపు సమావేశాల్లో పాల్గొంటూనే ఖాళీ దొరికినపుడల్లా సీఎన్ బీసీ–టీవీ18, బిజినెస్ టుడే, ఎకనమిక్ టైమ్స్, బ్లూమ్ బర్గ్, మనీ కంట్రోల్ వంటి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థల ప్రతినిధులతో ఇంటరాక్టివ్ సెషన్స్ కు హాజరై ఏపీలో పెట్టుబడులకు గల అనుకూలతలను వివరిస్తూ పారిశ్రామికవేత్తలను ఆకర్షించే ప్రయత్నం చేశారు. అంతర్జాతీయంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో తెస్తున్న సంస్కరణలు, ఫ్యార్మాస్యూటికల్, హెల్త్ కేర్, లాజిస్టిక్స్ రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను అంతర్జాతీయ వేదికపై నుంచి వివరించారు. డబ్ల్యూఈఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సుల్లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అంతరంగాన్ని ఆవిష్కరించారు.మైనస్ డిగ్రీల ప్రతికూల వాతావరణంలోనూ ఒకవైపు మంచువర్షం పడుతున్నా లెక్కచేయకుండా పట్టువదలని విక్రమార్కుడిలా దావోస్ రోడ్లపై నడుచుకుంటూ సమావేశాలకు హాజరై ఇతర రాష్ట్రాల ప్రతినిధులతో శెభాష్ అనిపించుకున్నారు. గురువారం తమ పుట్టిన రోజును కూడా పట్టించుకోకుండా రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఉదయం నుంచే పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చదివిన చదువు, ప్రపంచ బ్యాంకులో పనిచేసిన అనుభవంతో డబ్ల్యూఈఎఫ్ వేదికగా వివిధ రంగాలపై నిర్వహించిన సమావేశాల్లో అలవోకగా తన మనోగతాన్ని వెల్లడించారు.

ప్రపంచ పారిశ్రామికవేత్తలతో సమావేశమైన సందర్భంలోనూ మంగళగిరి చేనేతలపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. బిల్ గేట్స్, లక్ష్మీమిట్టల్ తో సీఎం చంద్రబాబుతో కలసి సమావేశమైన సందర్భంలో మంగళగిరి శాలువాలతోనే వారిని ముఖ్యమంత్రుల చేతులమీదుగా సత్కరించారు. తాము కలిసిన పారిశ్రామికవేత్తలందరినీ మంగళగిరి చేనేత శాలువాతో సన్మానించి తమ అభిమానాన్ని చాటారు. తాను ఎక్కడున్నా తమ మనసు మంగళగిరిలోనే ఉంటుందని చెప్పే మంత్రి లోకేశ్ మాటల్లోనే కాకుండా చేనేతలపై తన మమకారాన్ని చేతల్లో చూపించారు. ఇక దావోస్ వెళ్లే ముందు మంగళగిరి చేనేత శాలువాలను ప్రత్యేకంగా ఆర్డర్ చేసి సిద్ధం చేసుకొని వెళ్లారాయన. ఎటువంటి ఆడంబరాలకు తావీయకుండా డబ్ల్యూఈఎఫ్ వేదికగా ఏపీ బ్రాండ్ కోసం లోకేశ్ చేసిన కృషి కార్యరూపం దాల్చి త్వరలోనే రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది.

# ప్రణాళికలతో సిద్ధంగా ఉండండి

(మొదటి పేజి తరువాయి)

చర్చలను అధికారులకు తెలిపి, రానున్న ఆరు నెలల కాలంలో వాటిని ముందుకు తీసుకెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో జరిగిన చర్చల కొనసాగింపుగా పలు దేశాల ప్రతినిధులు, పలు సంస్థల సీఈఓలు, ఆయా దేశాల మంత్రుల బృందాలు త్వరలో రాష్ట్రంలో పర్యటించనున్నాయని, అందుకు ఆయా శాఖలు సన్నద్ధంగా ఉండాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. దిగ్గజ కంపెనీల సీఈఓలతో జరిగిన చర్చలపై సంతృప్తిని వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయా ప్రతిపాదనలు కార్యరూపం దాల్చి, పెట్టుబడులు పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కంపెనీలతో నిరంతరం సమీక్షలు, సంప్రదింపులు జరపడం ద్వారా పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా చూడాలని, వీటిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీఎస్ విజయానంద్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. దావోస్ ప్రపంచ ఆర్థికవేదిక సదస్సు పర్యటన నుంచి ఆయన నేరుగా ఢిల్లీ చేరుకున్నారు. శుక్రవారం ఉదయం నార్త్‌బ్లాక్‌లోని ఆర్థికశాఖ కార్యాలయంలో నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. సుమారు 45 నిమిషాలపాటు కొనసాగిన ఈ భేటీలో.. రాష్ట్రానికి ఆర్థిక సహకారంపై సీఎం చర్చించారు. ఫిబ్రవరి 1న కేంద్రప్రభుత్వం బ్జడెట్ ప్రవేశపెట్టనున్న తరుణంలో రాష్ట్రం తరఫున విజ్ఞప్తులను ఆమె ముందుంచారు. వైజాగ్ స్టీల్‌ఎ÷–లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ అమలు, పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రావాల్సిన నిధుల గురించి సీఎం ప్రస్తావించినట్లు సమాచారం.

ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడం ద్వారా భారీగా పెట్టుబడుల ఆకర్షణ కోసం నెట్‌వర్క్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా సాగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగు రోజుల దావోస్ పర్యటన గురువారంతో ముగిసింది. ప్రపంచ పెట్టుబడుల సదస్సులో పాల్గొన్న ఆయన.. ప్రముఖ సంస్థల సీఈవోలు, అధిపతులు, పలు దేశాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. వివిధ రంగాలకు చెందిన సుమారు 15 అత్యున్నత వాణిజ్య సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సుల్లో విరామం లేకుండా గడిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, అందుకు అనువైన పరిస్థితులను వివరించారు. నాలుగు రోజుల దావోస్ పర్యటన ముగించుకుని గురువారం అర్ధరాత్రి పొద్దుపోయిన తర్వాత ఢిల్లీకి చేరుకున్నారు.

దావోస్ నుంచి రాష్ట్రానికి తిరిగి వచ్చే ముందు వరకు సీఎం వివిధ సంస్థల అధిపతులు, వివిధ రంగాల ప్రముఖులతో సమావేశమై రాష్ట్రాభివృద్ధి కోసం చర్చలు జరిపారు. ప్రఖ్యాత పర్యావరణవేత్త, చె హోల్డింగ్స్ వైస్ ఛైర్మన్ ఆండ్రీ హాఫ్‌మన్‌తో సమావేశమయ్యారు. యూఎన్‌డీపీ అధిపతి అచిమ్ స్టెయినర్‌తోనూ భేటీ అయ్యారు. దావోస్‌లో 4 రోజులపాటు వివిధ రంగాలకు చెందిన వాణిజ్య సంస్థల ప్రతినిధులతో సీఎం సమావేశమై.. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు. వాణిజ్యాభివృద్ధికి, పారిశ్రామికవేత్తల కోసం తీసుకొచ్చిన పాలసీల గురించి చెప్పారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలు.. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాల గురించి వివరించారు. ఇక్కడి అనుకూల పరిస్థితులను స్వయంగా వచ్చి పరిశీలించాలని పెట్టుబడిదారులను ఆహ్వానించారు. ఢిల్లీలో ఆయనకు మాజీ ఎంపి కంభంపాటి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం శుక్రవారం గన్నవరం విమానాశ్రయం చేరుకున్నారు. మంత్రి కందుల దర్గేశం ఘనంగా స్వాగతం పలికారు.

# బనకచర్ల విషయంలో హరీశ్ రావు చేసిన ఆరోపణలు సరికాదు

జనవరి 24 ఆంధ్ర ప్రగతి :
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టు అంశంపై తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఈ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉందన్నారు. బనకచర్ల విషయంలో తమ ప్రభుత్వంపై హరీశ్ రావు చేసిన ఆరోపణలు సరికాదన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉత్తమ్ కుమార్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ హయాంలో నదీ జలాల విషయంలో చాలా నష్టం జరిగిందన్నారు.

తాము అధికారంలోకి వచ్చాక నష్టం తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చాలా పొరపాట్లు చేసిందని, వాటిని తాము సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఏపీ నిర్మిస్తున్న బనకచర్లపై అభ్యంతరాలు తెలుపుతూ ఇప్పటికే కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశామన్నారు. ఏపీ పునర్విభజన చట్టానికి ఇది విరుద్ధమని, ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించవద్దని కేంద్రాన్ని కోరామన్నారు

# టిడిఎస్ పథకం రద్దు కోరుతూ పిటిషన్

## తిరస్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జనవరి 24 ఆంధ్ర ప్రగతి :ఆదాయపు పన్ను చట్టం కింద పన్ను వసూలుకు అనుసరిస్తున్న టీడీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఓ వ్యక్తి సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనివల్ల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందని తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. అయితే, ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాలంటూ పిటిషనర్‌కు సూచించింది.ప్రతిచోటా అనుసరిస్తున్న టీడీఎస్ విధానాన్ని రద్దు చేయాలంటూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఆయన తరఫున మరో లాయర్ అశ్వినీ దూబే ఈ వ్యాజ్యాన్ని వేశారు. టీడీఎస్ విధానం సమానత్వపు హక్కుతో పాటు అనేక ప్రాథమిక హక్కుల్ని ఉల్లంఘిస్తోందని పేర్కొన్నారు. ఎలాగైనా దీన్ని రద్దు చేయాలని కోరారు. దీనిపై వాదనలు విన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల సారథ్యంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. లోపభూయిష్టంగా ఉన్న ఈ వ్యాజ్యాన్ని తాము విచారణకు స్వీకరించలేమని పేర్కొంది. టీడీఎస్ విధానం అన్ని దేశాల్లోనూ అమలవుతోందని గుర్తు చేసింది. కావాలంటే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు ధర్మాసనం సూచించింది.

# విజయసాయి రాజకీయాలకు గుడ్ బై...

## -రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటన

### -రాజ్యసభకు కూడా రాజీనామా చేస్తున్నట్లు వెల్లడి -తనను ఆదరించిన జగన్‌కు కృతజ్ఞతలు వెల్లడి



అమరావతి,జనవరి 24 ఆంధ్ర ప్రగతి : రాజకీయాల నుంచి తప్పుకొంటున్నట్టు వైకాపా రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తెలిపారు. రాజ్యసభ సభ్యత్వానికి ఈనెల 25న రాజీనామా చేస్తున్నట్టు ట్వీట్ చేశారు.విజయసాయిరెడ్డి రాజ్యసభ పదవీకాలం 2028 జూన్ వరకు ఉంది. మరో మూడేళ్ల పదవీకాలం ఉండగానే ఆయన రాజీనామా ప్రకటన చేయడం వైకాపాలో కలకలం రేపింది.'ఏ రాజకీయ పార్టీలో చేరను. వేరే పదవులు, ప్రయోజనాలు ఆశించి రాజీనామా చేయడం లేదు. ఈ నిర్ణయం పూర్తిగా నా వ్యక్తిగతం. ఎలాంటి ఒత్తిళ్లు లేవు. ఎవరూ ప్రభావితం చేయలేదు. నాలుగు దశాబ్దాలుగా, మూడు తరాలుగా నన్ను నమ్మి ఆదరించిన వైఎస్ కుటుంబానికి రుణపడి ఉన్నాను. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చిన జగన్, నన్ను ఇంతటి ఉన్నతస్థాయికి తీసుకెళ్లిన భారతికి సదా కృతజ్ఞుడిని. జగన్‌కి మంచి జరగాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. 'పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా, రాజ్యసభలో ఎ÷–లోర్ లీడర్‌గా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా.. పార్టీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా కృషి చేశా. కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వారధిలా పనిచేశా. దాదాపు తొమ్మిదేళ్ల పాటు ప్రోత్సహించి కొండంత బలాన్ని, మనోధైర్యాన్నిచ్చి తెలుగు రాష్ట్రాల్లో నాకు గుర్తింపునిచ్చిన ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ప్రత్యేక ధన్యవాదాలు. తెదేపాతో రాజకీయంగా విభేదించా. చంద్రబాబు కుటుంబంతో వ్యక్తిగతంగా విభేదాలు లేవు. పవన్ కల్యాణ్‌తో చిరకాల స్నేహం ఉంది. నా భవిష్యత్తు వ్యవసాయం. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఆదరించిన రాష్ట్ర ప్రజలు, మిత్రులు, సహచరులు, పార్టీ కార్యకర్తలకు.. ప్రతి ఒక్కరికీ పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు' అని విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు.

# రాజమండ్రి విమానాశ్రంలో ప్రమాదం

## క్రెయిన్ తెగిపడి కార్మికుడికి గాయాలు



రాజమండ్రి,జనవరి 24 ఆంధ్ర ప్రగతి :రాజమండ్రి విమానాశ్రయంలోని నూతన టెర్మినల్ భవన నిర్మాణంలో ప్రమాదం చోటు చేసుకుంది. క్రెయిన్ వైర్ తెగి టర్మినల్ భాగం కిందపడింది. ఈ ప్రమాదంలో ఒక కార్మికుడికి గాయాలైనట్లు తెలుస్తోంది. ఇటీవల నూతన టెర్మినల్ భవన నిర్మాణాలను పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పరిశీలించిన విషయం తెలిసిందే. అయితే కొద్ది రోజులకే నూతన టెర్మినల్ భవన నిర్మాణం వద్ద ఈ ప్రమాదం జరిగింది. రాజమండ్రి ఎయిర్‌పోర్టులో కొత్త టెర్మినల్ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి కొంత మంది కార్మికులు స్టీల్ స్టెక్చర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక స్టీల్ స్టక్చర్ కిందకు కూలిపోయింది. దీనిపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టు నూతన టెర్మినల్ భవనానికి సంబంధించిన స్టీల్ స్టక్చర్ కొంతభాగం నేలకొరిగిందని తెలిపారు. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయని.. ఇది పెద్ద ప్రమాదమేమీ కాదని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ వెల్లడించారు.

# హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు తక్షణమే ప్రారంభించాలి.

## -పంట కాల్వల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలి. - -సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య.

ఆంధ్ర ప్రగతి ఎమ్మిగనూరు జనవరి 24:
హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచి, ఆయకట్టు భూములకు సాగునీరు ఇచ్చేందుకు అవసరమైన నిధులను రాష్ట్ర బడ్జెట్లో కేటాయించాలని, హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు తక్షణమే సస్పెండ్,పంట కాల్వల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.
ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ..
కరువు పీడిత ప్రాంతంగా వున్న రాయలసీమ పంటపొలాలకు నికరసాగు జలాలు తీసుకరావడానికి గతం నుండి అనేక ప్రతిపాదనలు చేయబడ్డాయని,వ్యవసాయం కనీసంగా జీవించాలంటే సాగులోని 30 శాతం భూమికి కనీస సాగునీటి వనరులు కల్పించాలని "జాతీయ ఇరిగేషన్ కమీషన్" 1972 లో సూచించిందని తెలిపారు.2004లో ఏర్పాటయిన జయతి ఘోష్ కమీషన్, 2009 లో స్వామినాథన్ ఫౌండేషన్ వారి నివేదిక, 2012 లో ఐ సి ఏ ఆర్ న్యూ ఢిల్లీ కమిటీ వారు ఇచ్చిన నివేదికతో పాటు, రాష్ట్ర విభజన సందర్భంగా శ్రీకృష్ణ కమీషన్ నివేదిక ఈ ప్రాంతాల అభివృద్ధికి సాగునీటి అవసరాన్ని, అందుకు ప్రభుత్వాలు తీసుకోవలసిన చర్యల గురించి సిఫారస్సు చేసారని తెలిపారు.
హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80,000బీ అనంతపురం జిల్లాలో రెండు దశల కింద 3,45,000, కడప జిల్లాలో 37,500బీ చిత్తూరు జిల్లాలో 1,40,000 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి వుంది. అయితే ప్రస్తుత కాలువ సామర్థ్యం అందుకు అనుగుణంగాలేదు. కావున వరద కాలంలో ఎక్కువ నీటిని తీసుకోవడానికి వీలుగా పదివేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతామని 2019లో అనంతపురం జిల్లా పామిడి బహిరంగసభలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు ప్రకటించారని ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాలువ గురించి పట్టించుకోలేదని తెలిపారు.
కాలువ వెడల్పు కోసం రైతులు, రైతు సంఘాలు,




రాజకీయ పార్టీలు చేసిన ఆందోళనల తర్వాత 07-06-2021న జివో నెంబర్ 29 విడుదల చేసింది. దీని ప్రకారం 6,300 సామర్థ్యంతో కాలువ నిర్మాణం చేపడుతామని, అందుకు రూ.6,182 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేసారు. అయితే నిధులు విడుదల చేయకపోవడంతో పనులు జరగలేదని ఆరోపించారు.
గత ప్రభుత్వం హంద్రీనీవా కాలువ వెడల్పుకు, పంట కాలువల నిర్మాణానికి నిధుల ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహాన్ని మొన్నటి ఎన్నికల్లో వ్యక్తం చేసి తెలుగుదేశం కూటమి ప్రభుత్వాన్ని భారీ మెజారిటీతో గెలిపించారు. రానున్న బడ్జెట్ లో హంద్రీనీవా కాలువ వెడల్పును పదివేల క్యూసెక్కులకు పెంచేందుకు, ఆయకట్టు భూములకు సాగునీరు ఇచ్చేందుకు అవసరమైన పంటకాల్వల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.
వెనుకబడిన రాయలసీమ ప్రాంత అభివృద్ధికి కీలకమైన సాగునీటి వనరులను కలిపిస్తారని రైతాంగంలో వున్న ఆశలను నెరవేరుస్తామని పాలకులు చెపుతున్న మాటలు ఆచరణలో అమలు చేయడం లేదని ఆరోపించారు.
రాయలసీమ జిల్లాలకు హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా దాదాపు 6 లక్షలకు పైగా ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉందన్నారు.ప్రభుత్వాలు మారుతున్న రాయలసీమ సాగునీటి వనరుల అభివృద్ధి ఆశించినంతగా జరగడం లేదన్నారు.కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ చేయడానికి 404,404 జీవోలను విడుదల చేసిందన్నారు.రూ.930 కోట్ల నిధులను విడుదల చేసిందని, ఇది సాధ్యమయ్యే పరిస్థితి లేదన్నారు.
ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్ నర్సింహులు,సహయ కార్యదర్శి మహేష్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ,సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, శివరామకృష్ణ దేవరా, సుమిత్రమ్మ, మనోహర్ రెడ్డి, జ్యోతి చిన్నయ్య, మురళి, సుదీర్ కుమార్,వెంకటేష్, కోటేశ్వరరావు, సలీం భాషా, వేణు గోపాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఫరూక్ పై అసత్య ప్రచారం చేస్తే సహించే ప్రసక్తే లేదు.

### -ఎస్సీ ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ముద్దం నాగ నవీన్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 24: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి పెద్దలు ఎన్ఎండి ఫరూక్ పై అసత్య ప్రచారం చేస్తే సహించే ప్రసక్తి లేదని నంద్యాల జిల్లా ఎస్సీ , ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ముద్దం నాగ నవీన్ అన్నారు.ఈ సందర్భంగా పట్టణం లోని కార్యాలయంలో ముద్దం నాగ నవీన్ మాట్లాడుతూ..
గత రెండు రోజుల కిందట నందమూరి నగర్ వైఎస్ఆర్ నగర్ పర్యటనలో భాగంగా మంత్రి ఫరూక్ మాట్లాడిన మాటలను వక్రీకరించి లేనిది ఉన్నట్టుగా ఉన్నది లేనట్టుగా చెబుతూ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టడం చాలా హేమమైన విషయం అన్నారు. అసలు అక్కడ ఏం జరిగిందో తెలియకుండా ఏం మాట్లాడాడో చెప్పకుండా కుల ప్రస్తావన తీసుకొని రావడం దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని, కొందరు పేటీఎం బ్యాచులు కావాల్సినే మంత్రి ఫరూక్ పేరును చెడు చేయాలని ఉద్దేశంతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పనిచేసేవారిని ఎలా అయితే మెచ్చుకుంటారో పని చేయని వారిని పనిచేయలేదని చెబుతారు అన్నారు దీనికి కుల ముసుగు తొడిగి సోషల్ మీడియాలో కథనాలు పోస్ట్ చేయడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఇలాంటివి మళ్లీ పునరావృతమైతే అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలియజేశారు.

# నంద్యాల ఖిద్మత్ కమిటి సేవలు చాలా సంతృప్తి కలిగించాయి.

### -అభివృద్ధికి తన సహకారం ఉంటుంది.
### -ఋణ పంపిణిలో మణియార్ ఖలీల్.




ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 24:
నంద్యాల ఖిద్మత్ సొసైటి వడ్డీ రహిత ఋణాలు ఇస్తు చిన్న వ్యాపారులకు అండగా ఉంటుంది. నేటి ఋణ పంపిణి లో ప్రముఖ బులియన్ మార్కెట్ ప్రముఖులు, టీడిపి పట్టణ అధ్యక్షులు మణియార్ ఖలీల్ అహమ్మద్ ముఖ్య అతిథిగా పాల్గొని ఖిద్మత్ లో పది లక్షల రూపాయల రుణాలు పంపిణి చేసారు. ఈ సంధర్భంగా శ్రీ ఖలీల్ మాట్లాడుతూ జమాఅతె ఇస్లామీ హింద్ లాంటి ఉత్తమ సంస్థ, నిస్వార్థ సేవకులు సొసైటి నిర్వహిస్తున్నారని రెండు సంవత్సరాలలో పలుమార్లు సందర్శించానని ఖిద్మత్ పట్ల సంతృప్తిగా వారిని ప్రోత్సహిస్తు తన వంతుగా డిపాజిట్ చేస్తానని ప్రకటించారు. మార్కెట్ లో వడ్డీతో సతమతమయ్యే చిన్న వ్యాపారులు ఖిద్మత్ సభ్యులుగా చేరి దాని సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. బ్రాంచ్ అధ్యక్షులు యూనూస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఖిద్మత్ జిల్లా డైరెక్టర్ అబ్దుల్ సమద్ మాట్లాడుతూ నంద్యాల బ్రాంచి రెండేళ్ళలో పదిహేను వందల సభ్యులతో 60 కోట్ల రూపాయల కు పైగా టర్నోవర్ చేస్తుందని, పది కోట్లు ఋణాలుగా ఇచ్చినట్లు తెలిపారు. ఖిద్మత్ మ్యూచవల్ ఎయుడెడ్ కో ఆపరేట్ త్రిఫ్ట్ క్రెడిట్ సొసైటి ఎంపి మాక్స్ 1995 ద్వారా ప్రభుత్వం ఆమోదితమైనదని తెలిపారు. బియంసి సభ్యులు అలీం మాట్లాడుతు వడ్డీ రహిత సమాజం కోసం పేద వ్యాపారులు అభివృద్ధి చెందాలని నంద్యాలలో ఖిద్మత్ బ్యాంక్ స్థాపించడం జరిగిందని మతాలకు అతీతంగా ఎవరైనా ఖిద్మత్ సభ్యులుగా చేరవచ్చని తెలిపాతూ వందన సమర్పణ చేసారు. ఈ కార్యక్రమంలో ఖిద్మత్ మేనేజర్ ఇలియాస్ సభ్యులు హాఫీజ్ జమాన్, ఆసీఫ్, ఇలియాస్ ఇంకా ముహమ్మద్ షఫీ తదితర సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి నంది బాలోత్సవంలో గురురాజా విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ.




ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 24:
నంది విజ్ఞాన కేంద్రం వారు నంద్యాల పట్టణం మున్సిపల్ టౌన్ హాల్ నందు నిర్వహించిన జిల్లాస్థాయి ద్వితీయ నంది బాలోత్సవం పోటీల నందు నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీ నందుగల శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ఏకంగా 20 బహుమతులు సాధించినట్లుగా స్కూల్ డైరెక్టర్ పి. షేక్షా వలి రెడ్డి తెలిపారు.ప్రవేశించిన ప్రతి విభాగంలో బహుమతులను సాధించారు .చిత్రలేఖనం సబ్ జూనియర్స్ విభాగంలో పి ఇషాన్ రెడ్డి ప్రథమ స్థానం , వి .కార్తీక్ తృతీయ స్థానం, జూనియర్ విభాగంలో పి .దేవేంద్ర ద్వితీయ స్థానం, సీనియర్ విభాగంలో ఎన్ .ధనుష్ ద్వితీయ స్థానం, కార్టూన్ కాంపిటీషన్ నందు జూనియర్స్ విభాగంలో ఎన్. దుర్గ ప్రథమ స్థానం ,ఎస్ .నాయబ్ రసూల్ తృతీయ స్థానం, సీనియర్ విభాగంలో ఎన్. ధనుష్ ద్వితీయ స్థానం సాధించారు. శాస్త్రీయ నృత్య ప్రదర్శన సోలో విభాగంలో పి సరయు ద్వితీయ స్థానం, జానపద నృత్య ప్రదర్శనలో కే .తన్వి ప్రథమ స్థానం ,జానపద నృత్య ప్రదర్శన బృందం నందు ప్రథమ స్థానం తెలుగు వక్తృత్వం జూనియర్ భాగంలో బి .హర్షవర్ధన్ ప్రథమ స్థానం ,సీనియర్ విభాగంలో జి .సాయి వర్షిని ప్రథమ స్థానం ఇంగ్లీష్ వక్తృత్వం జూనియర్ విభాగంలో పి.చార్విత ద్వితీయ స్థానం, సీనియర్ విభాగంలో ఎస్. మహమ్మద్ గౌస్ తృతీయ స్థానం పద్య పఠనం జి .అలేఖ్య ప్రథమ స్థానం, కవితా రచనఏం .కావ్య సహస్ర తృతీయ స్థానం ,తెలుగులో మాట్లాడదాం బి .హర్షవర్ధన్ ప్రథమ స్థానం సైన్స్ ఎక్స్పో సీనియర్స్ విభాగంలో సి .జోష్న, ఎస్. మేఘ వర్షిత పదమస్థానం జూనియర్స్ విభాగంలో ఎస్వీ. నీరజ్ ద్వితీయ స్థానం సాధించారు. విద్యార్థుల విజయాలకు చక్కని శిక్షణ అందించిన ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన.




ఆంధ్ర ప్రగతి మహానంది జనవరి 24:
మహానంది మండలం గాజులపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రవణమ్మ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ...బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని తెలియజేశారు.బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.రాష్ట్ర ప్రభుత్వం బాల్యవివాహాలను అడ్డుకట్ట వేసేందుకు అనేక కార్యక్రమాలను చేపడుతుందని తెలిపారు.చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల, అమ్మాయిలు మానశిక, శారీరక ఒత్తిడికి గురి కావడం, ప్రసవ సమయంలో తల్లి బిడ్డ ప్రాణాలు కోల్పోతారని తెలుపారు. విద్యార్థులు తల్లిదండ్రులకు నమ్మకాన్ని ఇస్తూ, చదువు మీద దృష్టి పెట్టి, బాగా చదువుకోవాలని, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మీనారాయణమ్మ, మహిళా పోలీస్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని పరిరక్షిస్తే ప్రపంచాన్ని రక్షించినట్లే

## యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు.

**-మీ భవిష్యత్తు ఆరోగ్యంగా ఆనందంగా కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి.**

**-పర్యావరణ పరిరక్షణ కమిటీ నాయకులు యాగంటీశ్వరప్ప.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 24:
భవిష్యత్తులో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రపంచంలోని అందరము ఆరోగ్యంగా ఉండాలంటే పర్యావరణ పరిరక్షణ ప్రధమ ధ్యేయంగా ప్రతి ఒక్కరము కృషి చేయాలని, విద్యార్థి దశ నుండే మొక్కలు నాటడం సంరక్షించుకోవడం ప్రధాన లక్ష్యంగా విద్యార్థులు కృషి చేయాలని, ఇది కూడా ఒక రకంగా దేశ రక్షణలో దేశ అభివృద్ధిలో భాగమేనని జాతీయ పర్యావరణ పరిరక్షణ నాయకులు యాగంటిశ్వరప్ప నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బొమ్మ సత్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సు కార్యక్రమానికి రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల కళాశాల బాటనీ లెక్చరర్ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ చక్కగా విద్యార్థులను పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేసేలా వివరించిన యాగంటిస్వరప్ప కి, ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరిపట్ల మాట్లాడుతూ ప్రేమ కోసం చంపడాలు చావడాలు లాంటి వారి గురించి మాత్రమే కాకుండా మొక్కల మీద ప్రేమతో రాజులను ఎదిరించి చనిపోయిన వారి గురించి, మొక్కలు నాటడంలో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన వారి గురించి కూడా తెలుసుకోవాలని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలలో భాగస్వాములు అవ్వాలని విద్యార్థులకు సూచించారు.
యాగంటిస్వరప్ప మాట్లాడుతూ ప్రపంచంలో పర్యావరణ పరిరక్షణలో మొట్టమొదటగా ప్రపంచంలోనే అత్యున్నత నోబుల్ అవార్డు పొందిన కెన్యా దేశస్థురాలు వంగరి మత్తయి గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, అలాగే మన దేశంలోనే సుమారు 300 సంవత్సరాల క్రితం మొక్కలను కాపాడడానికి 333 మంది మహిళలు అమృత మాత బిస్నోయి నాయకత్వంలో ప్రాణాలు విడిచిన విషయాన్ని విద్యార్థులకు విశదీకరించరు.
ఒక్కొక్క మొక్క నాటడం ద్వారా , దాన్ని పరిరక్షించుకోవడం ద్వారా, కొన్ని లక్షల రూపాయల విలువైన ఆరోగ్యకరమైన గాలి మనకు అందుతుందని, వాటిని సంరక్షించుకోకపోతే భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతుందని , ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చేపట్టబోయే పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# హెల్మెట్ ధరించడం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన పోలీసులు.





ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ జనవరి 24: నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా నంద్యాల జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సంబంధిత పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నిబంధనలు మరియు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మోటర్ సైకిల్ పై ర్యాలీ నిర్వహించి హెల్మెట్ ధరించడం వలన కలుగు ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్బంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ వాహనచోదకులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అలా హెల్మెట్ ధరించి వాహనం నడపడం వల్ల కళ్ళలో దుమ్ము దులి పడకుండా రక్షణగా ఉండటమే కాకుండా అనుకోని రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. మద్యం సేవించి గాని మరియు పరిమితికి మించి వేగంగా వాహనాలు నడపడం కానీ చేయకూడదు. మొబైల్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం, మైనర్లు డ్రైవింగ్ చేయడం, ర్యాష్ డ్రైవింగ్ మరియు ట్రిపుల్ డ్రైవింగ్ వంటివి చేయకూడదాని ఎవరైనా పోలీసుల మాటలను వినకుండా నిబంధనలు ఉల్లంఘిస్తే అట్టి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియచేసినారు.కావున ప్రజలందరూ ట్రాఫిక్ నిబందనలు పాటించి సురక్షితంగా గమ్యాలను చేరుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.

# మంత్రి ఫరూక్ సుడిగాలి పర్యటన..

## కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులకు శ్రీకారం.







ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 24:
నంద్యాల టౌన్ లో 35 వ వార్డు సలీం నగర్ ,14 వ వార్డు సరస్వతి నగర్ , 24 ,25 వార్డు నౌమాన్ నగర్, 27 వ ఏబీఎన్ చర్చ్ ఆర్చ్ దగ్గర నూతన సీసీ రోడ్లకు , డ్రైనేజీ కాలువలకు , మున్సిపాలిటీ వాటర్ పైప్ లైన్లకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టిందన్నారు గత వైసిపి ప్రభుత్వం లో రోడ్లు కాలువలు మంచినీటి వసతి లేక ప్రజలు చాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందన్నారు. ఆ సమస్యలను గమనించిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆంధ్రప్రదేశ్ ని నవ్యాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దే దిశలో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రోడ్లను , కాల్వలను , మున్సిపాలిటీ పైప్ లైన్ పనులను ప్రారంభించడం జరిగిందని అందులో భాగంగానే నంద్యాలలో పలు వార్డులలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. మరోవైపు పట్టణంలోని కుబ్రా మసీద్ కు శంకుస్థాపన చేసిన మంత్రి ఫరూక్ చేశారు.నంద్యాల స్థానిక 25వ వార్డు నందుగల కుబ్రా మసీద్ ను నూతన హంగులతో నిర్మించడానికి ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అభివృద్ధికి సంబంధించి ఈరోజు మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , మున్సిపల్ చైర్పర్సన్ మనున్నిసా , మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, కుబ్రా మసీద్ కమిటీ సభ్యులు మరియు టిడిపి వార్డు ఇంచార్జ్ లు, టిడిపి వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మీర్‌పేట్ మర్డర్ కేసులో మరింత లోతుగా విచారణ

**-కాలిన స్థితిలో దొరికిన మాధవి వెంట్రుకలు - ఇంట్లోనే కాల్చివేసినట్లు భావిస్తున్న పోలీసులు..**
**-డీఎన్ఏ పరీక్షల కోసం ల్యాబ్‌కు తరలింపు**

హైదరాబాద్,జనవరి 24 ఆంధ్ర ప్రగతి :
హైదరాబాద్‌లోని మీర్‌పేట్ మహిళ మర్డర్ కేసులో సంచలన విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఇప్పటికే పోలీసులు రెండుసార్లు సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. నిందితుడు గురుమూర్తి పోలీసులకు పొంతన లేని సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తోంది. గురువారం పిల్లల స్టేట్మెంట్‌ను రికార్డు చేశారు. సంక్రాంతికి ఊరెళ్లి వచ్చిన తర్వాత కూతురు అమ్మ ఎక్కడ అని అడిగితే తన తండ్రి మౌనంగా ఉండిపోయినట్లు చెబుతోంది. ఇంట్లో భరించలేని దుర్వాసన వచ్చిందని పోలీసులకు చెప్పినట్లు సమాచారం. అటు, గురుమూర్తి ఇంటిని పోలీసులు మరోసారి తనిఖీ చేశారు. గురుమూర్తి తన భార్య మాధవి శరీర భాగాలను ఇంట్లోనే కాల్చిన ఆనవాళ్లను గుర్తించారు. మాధవి హెయిర్ శాంపిల్స్ కాలిన స్థితిలో దొరికాయి. వీటికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఆ నివేదిక ఆధారంగా నేర నిరూపణ సాధ్యమని భావిస్తున్నారు. ఇన్‌ఫ్రారెడ్ టెక్నాలజీ ద్వారా ఇంట్లో రక్తపు మరకలు గుర్తించారు. నిందితుడు గురుమూర్తి పూటకో మాట చెబుతూ పొంతన లేని సమాధానాలు చెప్తుండడంతో పోలీసులు షాక్ అవుతున్నారు. తన భార్యను తానే చంపినట్లు



నేరం అంగీకరించిన నిందితుడు.. ఆ తర్వాత ఆధారాలు ఏమైనా ఉన్నాయా.? అంటూ పోలీసులనే ప్రశ్నించినట్లు తెలుస్తోంది. తాను కోర్టులో తేల్చుకుంటానంటూ వారికి సవాల్ చేసినట్లు సమాచారం. అటు, ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల వారు కొందరు ఇళ్లకు తాళాలు వేసుకుని బంధువుల ఇళ్లకు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం జేపీ చెరువుకు చెందిన గురుమూర్తి ఈ నెల 15న భార్య వెంకటమాధవిని హత్య చేశాడు. వీరు రంగారెడ్డి జిల్లా మీర్ పేట్ పీఎస్ పరిధిలోని బాలాపూర్ మండలం జిల్లెలగూడ న్యూ వెంకటేశ్వర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. భార్యను చంపడానికి ముందే పిల్లలను పండగ సెలవులకు హైదరాబాద్‌లోనే ఉంటున్న తాతగారి ఇంటికి పంపేశాడు. సంక్రాంతి రోజున భార్యను హత్య చేసిన అనంతరం మటన్ నరికే కత్తితో మృతదేహాన్ని ముక్కలు చేశాడు. ఆ తర్వాత శరీర భాగాలను కుక్కర్ లో ఉడికించాడు. అనంతరం వాటిని రోకలితో దంచి పొడి చేశాడు. ఆ పొడిని జిల్లెలగూడ చెరువులో పడేశాడు. ఈ నెల 17న అత్తగారికి ఫోన్ చేసి భార్య కనిపించడం లేదని చెప్పాడు. కూతురు అదృశ్యంపై వారు ఈ నెల 18న పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారించిన పోలీసులు భర్త గురుమూర్తిపై అనుమానంతో తమదైన శైలిలో విచారించగా అసలు నిందితుడని తేలింది. భార్యను చంపడానికి ముందు ఓ కుక్కను చంపి ముక్కలుగా నరికి ట్రయల్ వేసినట్లు పోలీస్ విచారణలో వెల్లడైంది. అయితే, తొలుత అనుమానంతోనే భార్యను హత్య చేసినట్లు భావించిన పోలీసులకు విచారణలో మరిన్ని విషయాలు తెలిశాయి. నిందితునికి మరో మహిళతో అక్రమ సంబంధం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే తన భార్యను చంపి ఉంటాడని భావిస్తున్నారు. గురుమూర్తి ఫోన్ చూసిన పోలీసులకు దీనిపై ఓ క్లారిటీ వచ్చింది.

# దేవాదాయశాఖ కమిషనర్ నియామకంపై పిటిషన్

## థర్డ్‌పార్టీ పిటిషన్‌పై హైకోర్టు అసంతృప్తి

అమరావతి,జనవరి 24 ఆంధ్ర ప్రగతి :
:ఏపీ దేవాదాయ శాఖ కమిషనర్‌గా కె.రామచంద్రమోహన్ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. థర్డ్ పార్టీ పిటిషన్ దాఖలు పట్ల న్యాయమూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'రామచంద్రమోహన్ పోస్టింగ్‌తో ఎవరికైనా అన్యాయం జరిగితే కోర్టును ఆశ్రయించాల్సింది వాళ్లు కదా? థర్డ్ పార్టీ ఎలా పిటిషన్ దాఖలు చేస్తుందని ప్రశ్నించారు. పిటిషన్‌పై ఆదేశాలు ఇచ్చేందుకు నిరాకరించిన న్యాయమూర్తి.. సర్వీస్ మ్యాటర్స్ పరిశీలించే బెంచ్‌కి ఈ పిటిషన్‌ను పంపాలని సూచించారు. హైకోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో దేవాదాయశాఖ ప్రస్తుత కమిషనర్ సత్యనారాయణ రిలీవ్ అయ్యే అవకాశముంది. నాలుగు రోజుల కిందట జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో దేవాదాయశాఖ కమిషనర్, ఆ శాఖ ఇన్‌ఛార్జి కార్యదర్శి సత్యనారాయణను బీసీ సంక్షేమశాఖ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో దేవాదాయ శాఖ కమిషనర్‌గా రామచంద్ర మోహన్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన్ను ఎలాగైనా దేవాదాయ కమిషనర్ పదవి చేపట్టనివ్వకుండా కొందరు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయనకు అర్హత లేదంటూ హైకోర్టులో గురువారం ఒకరు పిటిషన్ వేశారు. గతంలో సింహాచలం భూముల కేసులో ఆయన్ను ప్రభుత్వానికి సరెండర్ చేశారని, సస్పెండ్ కూడా అయ్యారని, విజిలెన్స్ విచారణ జరుగుతోందని, అప్పట్లో కోర్టును తప్పుదోవ పట్టించి మళ్లీ ఉద్యోగంలో చేరారని అందులో ప్రస్తావించారు. విచారణ చేపట్టిన హైకోర్టు.. థర్డ్ పార్టీ పిటిషన్ దాఖలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆదేశాలు ఇచ్చేందుకు నిరాకరించింది.

# ప్రభుత్వ అభివృద్ధి పనులతో పల్లెల్లో పండగే..

## అన్ని రంగాల్లోనూ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి - మంత్రి కొలుసు పార్థసారథి

విజయవాడ,జనవరి 24 ఆంధ్ర ప్రగతి : కూటమి ప్రభుత్వ అభివృద్ధి పనులతో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొందని.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం నందిగామ నియోజకవర్గంలోని చందర్లపాడు మండలం, గుడిమెట్ల గ్రామ పంచాయతీ పరిధిలో రూ. 51 లక్షలతో పూర్తిచేసిన పలు అభివృద్ధి పనులను రాష్ట్ర గృహ నిర్మాణం; సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి.. నందిగామ శాసన సభ్యులు తంగిరాల సౌమ్య, స్థానిక



ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ప్రారంభించారు. తొలుత గుడిమెట్ల శివారు లక్ష్మీపురంలో హౌసింగ్ కాలనీ వరకు జిల్లా ప్రజాపరిషత్ నిధులు రూ. 15 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. అనంతరం మంత్రివర్యులు పలు సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు ముఖ్యమంత్రి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తోందని వివరించారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువ నేత లోకేష్ రాత్రనక పగలనకా కష్టపడుతు న్నారని పేర్కొన్నారు. ప్లలెల్లో రహదారులు, డ్రైనేజీ తదితర వ్యవస్థలను ఆధునికీకరించడం వల్ల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఒక పద్ధతి ప్రకారం, సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిపై నమ్మకంతో లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. గూగుల్, టీసీఎస్, రిలయెన్స్ వంటి పెద్ద సంస్థలతో చేసిన చర్చలు ఫలిస్తున్నాయని మంత్రి పార్థసారథి తెలిపారు.




# ఎపిలో క్లీన్ ఎనర్జీదే ఇక కీలక పాత్ర

## విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

విజయవాడ,జనవరి 24 ఆంధ్ర ప్రగతి :: రాబోయే ఐదేళ్ల కాలంలో ఏపీ మొత్తం క్లీన్ ఎనర్జీనే ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. విజయవాడ సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రీసెర్చ్ కాంక్లేవ్ - 2025లో ముఖ్య అతిథిగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా



మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మీడియాతో మాట్లాడుతూ... ప్రతీ ఇంట్లో ఒక వ్యక్తి ఉద్యోగస్తుడై ఉండాలని నాడు చంద్రబాబు నాయుడు సంకల్పించారని అన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి చేసిన ఐటీ రంగంతో తెలుగు వారు ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. గ్రీన్ ఎనర్జీతో రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు, ఉద్యోగాలతో పాటు పొల్యూషన్ ఫ్రీ స్టేట్‌గా ఏపీ మారుతుందని తెలిపారు. విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా మారి ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు.

---------------

# సూర్యఘర్ ద్వారా ఇంటింటికీ ఆదాయం

## మంత్రి సత్యకుమార్ వెల్లడి



విజయవాడ,జనవరి 24 ఆంధ్ర ప్రగతి :రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు తగ్గుతున్నాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారధి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ పాల్గొని మాట్లాడారు. అన్ని స్థాయిల్లో వ్యవస్థలో పద్ధతి ప్రకారం అన్ని పదవుల నిర్ణయం జరుగుతుందని చెప్పారు. అధికారంలో భాగస్వామ్యం ఉంది కనుక ప్రజల సమస్యలు తీర్చడంలో ముందున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. సూర్యఘర్ ద్వారా ప్రతీ ఇంటికి ఆదాయ వనరుగా మార్చే పనులు చేస్తున్నామని తెలిపారు. 2030 నాటికి 500 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. పిపిపి మోడ్‌లో మెడికల్ కాలేజీలు తేవాల్సిన పరిస్థితికి గత వైసీపీ ప్రభుత్వమే కారణమన్నారు. నిధులు సరిగా ఇవ్వకుండా కాలేజీల నిర్మాణం జరగకపోవడానికి గత ప్రభుత్వం కారణమని ఆరోపించారు. సిద్దార్థ మెడికల్ కాలేజీలో విద్యార్థినులకు హాస్టల్ లేదన్నారు. ఖ4 మోడల్‌లో మెడికల్ కాలేజీలు వచ్చిన దానికి తగిన ఫ్రీ సీట్లు ఉంటాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

--------

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# నిరంకుశ విధానాలను మొగ్గలోనే తుంచేయాలి !

జనవరి 24 ఆంధ్ర ప్రగతి :

ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసి కనీసం 8 గంటల పని కాలాన్ని సాధించి మేడే జరుపుకుంటున్న వేళ ఇటీవల అందుకు భిన్నంగా కొందరు కార్పోరేట్లు చేస్తున్న వ్యాఖ్యలు దీనిని అవహేళన చేసేలా ఉన్నాయి. అంతెందుకు ఉద్యోగులను పని యంత్రాలుగా భావిస్తున్నారు. నిరంతరం ఊడిగం చేసేలా..ఇల్లూ వాకిలి వదిలేసి పనికే పరిమితం కావాలన్న వీరి నిరంకుశ ఆలోచన విధానాలను ఆదిలోను తుంచేయాలి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగబోతున్న వేళ విపక్షాలు ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించాలి.పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రతల లేకుండా, జీవితంలో ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో తెలియ కుండా చేస్తున్నారు. నిజానికి ఈ సమయంలో అయినా ఇక ఉద్యోగాలకు భద్రత కల్పించేలా, పనిగంటలు నిర్దేశించే లా కఠిన చర్యలకు ప్రభుత్వాలు ఉపక్రమించాలి. నిజానికి పనిచేసే ప్రదేశంలో మంచి వాతావరణం ఉంటే చెప్పకుండానే ఉద్యోగులు శ్రమిస్తుంటారు. ఇక అసలు విషయానికి వస్తే....వారానికి 90 పని గంటలు ఉండాలంటూ ఎల్ అండ్ టి ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఆయన దుర్మార్గపు వర్గ స్వభావాన్ని బట్టబయలు చేసాయి. 'ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు? భార్యను ఎంతసేపు తదేకంగా చూస్తూ కూర్చుంటారు? ఆదివారం పూట కూడా పనిచేయించలేక పోతున్నందుకు బాధపడుతున్నాను' అని అయన అన్నారు. కొన్నాళ్ల క్రితం ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కూడా ఇటువంటి వ్యాఖ్యలే చేసిన విషయం తెలిసిందే. వారానికి 70గంటలు పనిచేయాలని నారాయణమూర్తి అప్పట్లో చెప్పారు. ఇప్పుడు సుబ్రమణ్యన్ మరో 20 గంటలు అదనంగా కలిపి 90 గంటలు వారానికి పనిచేసి తీరాలంటున్నారు. అలా చేస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలపై కార్మికలోకం సహజంగానే ఆగ్రహిస్తోంది. ఇది పారిశ్రామిక విప్లవం తొలినాళ్లలో కనిపించిన బానిస మనస్తత్వానికి నిదర్శనం. దీనిని ఆదిలోనే అరికట్టాలి. కేంద్రం దీనిపై ఎలాంటి స్పందనా చూపలేదు.అందుకే విపక్షాలు పార్లమెంట్ సమావేశాల్లో దీనిని ప్రస్తావించి , ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారి మనస్తత్వాన్ని ఎండగట్టాలి. అవసరమైతే కార్మిక చట్టాలను బలోపేతం చేసేందుకు పూనుకోవాలి. పనిదినాలు, సెలవులు,కార్మిక చట్టాలు చట్టుబండలు అవుతున్న వేళ వీరు ఇలా రెచ్చిపోతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే ఉద్యోగులను యంత్రాలుగా చూస్తున్నారు. భారతీయ కార్మికుల రక్త, మాంసాలను దోచుకోవడానికి పోటీ పడుతున్నారన్న భావన కలుగుతోంది. ఇలాంటి వారిని నిగ్గదీయాలి. ఇదే సమయంలో కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అన్న ఆలోచన చేయాలి. ఐటి ఉద్యోగులే కాకుండా చిన్నాచితక కంపెనీలు, రియల్ ఎస్టేట్‌లో పనిచేస్తున్న దినసరి కూలీలు ఇష్టపికే వెట్టి చాకిరీ చేస్తున్నారు. ఇలాంటి వారి గురించి ఆరా తీయాలి. కార్పొరేట్ ప్రపంచంలో కూడా సుబ్రమణ్యన్ వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. హర్ష్ వర్ధన్ గోయెంకా, ఆనంద్ మహీంద్ర తదితరులు ఆ వ్యాఖ్యలలోని హేతుబద్ధతను తప్పు పట్టారు.



కార్పొరేట్–మతశక్తుల కూటమిగా కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా పనిగంటలను పెంచేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా లేబర్‌కోడ్‌లను రూపొందిం చింది. ప్రస్తుతమున్న గరిష్ట పనివేళలను మార్చడానికి ఆ కోడ్‌లలో ప్రతిపాదించింది. కార్మిక సంఘాల నుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో లేబర్ కోడ్‌లను ఇంకా నోట్గి÷ చేయలేదు. మరోవైపు వివిధ రాష్ట్రాల్లో ఉన్న కొన్ని బిజెపి ప్రభుత్వాలు కూడా పనిగంటలు పెంచేందుకు చట్టాలు తీసుకు రావడానికి చేస్తున్న ప్రయత్నాలను కార్మిక సంఘాలు అడ్డుకుంటున్నాయి. ఉత్పత్తిని పెంచడానికి, ఆర్థిక వృద్ధిని సాధించడానికి కార్మికులు ఎక్కువ గంటలు పని చేయాలని కొన్ని కార్పొరేట్ శక్తుల మాదిరిగానే ప్రభుత్వాలు కోరుకుంటుం డటం గమనార్హం.

ఇది కార్మికుల రక్తమాంసాలతో కార్పొరేట్లకు లాభాలను వండి, వడ్డించే దుర్మార్గ చర్య! పనిగంటలు పెంచితే కార్మికులు గుండెపోటుతో మరణించే అవకాశం ఉందంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన హెచ్చరిక ఈ సందర్భంగా గర్తించాలి. నిజానికి మనిషి పనిచేయడానికి కొన్ని గంటలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఆ తరవాత విశ్రాంతి కూడా అంతే ముఖ్యం. కొంత ఉల్లాసం కూడా అవసరం. అలా చేయలేకపోతే మనిషి శరీరం పనిచేయదు. మెదడు ఆలోచించదు. మొద్దుబారి పోతుంది. నిజానికి దేశాభివృద్ధికి ఆటకం కలిగిస్తున్న అంశాలేమిటి? ప్రస్తుత సంవత్సరం జిడిపి 6.4 శాతానికి తగ్గుతుందని, నాలుగేళ్లలో ఈ స్థాయి పతనం ఎప్పుడూ లేదని జాతీయ గణాంకాల సంస్థ తెలిపింది. ప్రజల వద్ద కొనేందుకు డబ్బు లేకపోవడంతో దేశీయ మార్కెట్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కుంటున్న ఫలితమిది. గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న వారి వాస్తవ ఆదాయంలోఎటువంటి పెరుగుదల లేదు. దానికి తోడు ద్రవ్యోల్బణం వెంటాడుతోంది. నిరుద్యోగం ఏటికేడాది పెరుగుతూనే ఉంది. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి ప్రభావాలు మార్కెట్‌ను వెంటాడుతూనే ఉన్నాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం సామాజిక సంక్షేమ వ్యయాన్ని తగ్గిస్తోంది. రైతుల పంటలకు కనీస మద్దతు ధర లభించడంలేదు. ఉపాధిహామీ నిధుల్లోనూ కేంద్రం కోత పెట్టింది. కార్మికులు శ్రమించి అధికోత్పత్తి చేసినా మార్కెట్లలో కొనే నాధుడు లేని పరిస్థితి నెలకొంది. ఈ అస్తవ్యస్థ విధానాలు మారాలి. సరైన విశ్రాంతి, వినోదంతోనే కార్మికలోకం అసాధ్యమైన విజయాలను సైతం సుసాధ్యం చేస్తుందన్న నిజాన్ని పాలకవర్గాలు గుర్తించాలి. ఎనిమిది గంటల పని హక్కును పోరాడి సాధించుకున్న కార్మికవర్గం మళ్లీ అలాంటి పోరాటాలు చేసైనా దానిని నిలబెట్టుకోవాల్సిన అవసరాన్ని తాజా ఘటనలు గుర్తు చేస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్రం ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలి. మనుషులను బానిసలుగా భావించే వర్గాలను గుర్తించి చీల్చి చెండాడాలి.

# రథసప్తమికి తిరుమలలో భారీగా ఏర్పాట్లు

**ఉదయం సూర్యప్రభ ..సాయంత్రం చంద్రప్రభ వాహనం**

**అధికారులతో కలసి పరిశీలించిన ఇవో**

**విఐపి బ్రేక్ దర్శనలకు అనుమతి ఉండదని వెల్లడి**

తిరుమల,జనవరి 24 ఆంధ్ర ప్రగతి :

ఫిబ్రవరి 4వ తేదీన తిరుమలలో జరగనున్న రథసప్తమి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శు క్రవారం అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరితో కలిసి వివిధ విభాగాల అధికారులతో ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. రథసప్తమి రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏడు వాహనాలపై శ్రీ మలయప్ప స్వామి వారు ఊరేగింపు ఉంటుందని తెలిపారు. భక్తులు గ్యాలరీలోకి ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్యాలరీలలో ఉండే భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

అనంతరం అధికారులతో కలిసి నాలుగు మాడ వీధుల్లో ఏర్పాట్ల పరిశీలించారు. రథసప్తమి సందర్భంగా పలు సేవలు, ప్రివిలేజ్ దర్శనాలు రద్దు చేసినట్లు ఈవో పేర్కొన్నారు. అష్టదళ పాద పద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను రద్దు చేసినట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లు జారీ ఉండవని, ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశామని వివరించారు. బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఫిబ్రవరి 3న ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు ఉన్న భక్తులు వేచి ఉండకుండా నిర్ణీత సమయంలో మాత్రమే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద రిపోర్ట్ చేయాలని కోరారు. ఈ సమీక్షలో తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్ తదితరులు పాల్గొన్నారు.తిరుమలలో మినీ బ్రహ్మోత్సవాల తరహాలో జరగనున్న రథసప్తమి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. రథసప్తమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో అదనపు ఈవో, వివిధ విభాగాల అధికారులతో ఈవో సమీక్షించారు. భక్తులు గ్యాలరీల్లోకి ప్రవేశించే, నిష్క్రమణ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్యాలరీలలో ఉండే భక్తులకు



సకాలంలో అన్నప్రసాదాలు, తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం.. అదనపు ఈవో వెంకయ్యచౌదరి, అధికారులతో కలిసి తిరుమల మాడవీధుల్లో ఏర్పాట్లను ఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. 'శ్రీవారి ఉత్సవాల్లో రథసప్తమి అత్యంత ముఖ్యమైనది. ఏటా శుక్లపక్ష సప్తమి తిథిలో సూర్య జయంతి సందర్భంగా తిరుమలలో రథసప్తమిని వైభవంగా నిర్వహిస్తారు. ఈ వేడుకకు సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. వేడుకల్లో భాగంగా స్వామివారు సప్త వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారు. ఫిబ్రవరి 4న ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహన సేవతో రథసప్తమి వేడుకలు ప్రారంభమవుతాయి. అదే రోజు రాత్రి చందప్రభ వాహనసేవతో శ్రీమలయప్పస్వామివారి వాహన సేవలు ముగుస్తాయి' అని ఈవో తెలిపారు.

# తెలంగాణకు 20 లక్షల ఇండ్లు మంజూరు చేయండి

**తెలంగాణ ఇళ్ల నిర్మాణానికి సమగ్రమైన డాటా, పూర్తి ప్రణాళిక**

**మెట్రో ఫేజ్-2 కింద ఆరు కారిడార్లను గుర్తించాం**

**మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు చేయూతనివ్వండి**

**కేంద్రమంత్రి ఖట్టర్‌తో సమీక్షలో సీఎం రేవంత్ విజ్ఞప్తి**

హైదరాబాద్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 కింద తెలంగాణకు 20 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశ పట్టణ జనాభాలో ఎనిమిది శాతం ప్రజలు తెలంగాణలో ఉన్నారని సీఎం తెలిపారు. పీఏఎంవై (యూ)తోపాటు పట్టణాభివృద్ధి, విద్యుత్ శాఖల పనితీరుపై కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. బేగంపేటలోని హోటల్ ఐటీసీ కాకతీయలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ తో అర్బన్ అండ్ పవన్ సెక్టర్‌పై జరిగిన సమీక్షా సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రపర్యటనలో ఉన్న కేంద్రమంత్రి ఖట్టర్ ఉదయం కరీంనగర్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ చేరుకుని సిఎంతో సమీక్షించారు.

పీఎంఏవై 2.0లో చేరిన తొలి రాష్ట్రమైన తెలంగాణ



ఇళ్ల నిర్మాణానికి సమగ్రమైన డాటా, పూర్తి ప్రణాళికతో సన్నద్ధంగా ఉన్నందున రాష్ట్రానికి 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. దేశంలోని మహా నగరాలైన ఢిల్లీ, చెన్నై, బెంగళూరుతో పోల్చితే హైదరాబాద్‌లో మెట్రో కనెక్టవిటీ తక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో మెట్రో ఫేజ్–2 కింద ఆరు కారిడార్లను గుర్తించామని మనోహర్‌లాల్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కారిడార్ –4: నాగోల్–శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కి.మీ.), కారిడార్–5: రాయదుర్గం–కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), కారిడార్–6: ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), కారిడార్–7: మియాపూర్–పటాన్‌చెరు (13.4 కి.మీ.), కారిడార్–8: ఎల్ బీ నగర్–హయత్ నగర్ (7.1 కి.మీ), కారిడార్– 9: రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం–ఫోర్త్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) (40 కి.మీ.) ఉన్నాయని వివరించారు. మొదటి అయిదు కారిడార్ల (76.4 కిమీ) కోసం డీపీఆర్లు పూర్తయ్యాయని కేంద్ర మంత్రి ఖట్టర్ దృష్టికి సీఎం రేవంత్ రెడ్డి తెచ్చారు. ఈ కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 కోట్లు వ్యయమవుతుందన్నారు. డీపీఆర్లు ఆమోదించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యం (జేవీ) కింద చేపట్టి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు చేయూతనివ్వాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసీలో మురుగు చేరకుండా నదికి ఇరువైపులా 55 కి.మీ. (మొత్తంగా 110 కి.మీ.) కాలువలు, బాక్స్ డ్రెయిన్లు, ఎస్టీపీల నిర్మాణానికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంతోపాటు సమీపంలోని 27 పట్టణ పాలక సంస్థల పరిధిలో మురుగు నీటి నెట్‌వర్క్ నిర్మాణానికి రూ.17,212 కోట్లతో సమగ్ర మురుగునీటి మేజర్ ప్లాన్ (సీఎస్ఎంపీ) తయారు చేశామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అమృత్ 2.0 లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా సీఎస్ఎంపీని గుర్తించి నిధులు సమకూర్చాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ఎ÷–లాన్‌ను నోటిఫై చేసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. వరంగల్‌లో రూ.41,70 కోట్లతో సమగ్ర భూగర్భ నీటి పారుదల (యూజీడీ) పథకాన్ని చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు.

# మహాకుంభమేళాపై విదేశీయుల ఆసక్తి

## - భారీగా తరలి రావడంతో పెరిగిన ఆదాయం

ప్రయాగ్‌రాజ్,:144 ఏళ్ల తర్వాత ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభ మేళాకు ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. దీంతో విదేశీ టూరిజంలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. ముఖ్యంగా బారత్ లో జరిగే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అమెరికా, యూకే వంటి దేశాల నుంచి పర్యాటకులు పోటెత్తుతున్నారు. దీంతో భారత్ ఆధ్యాత్మిక పర్యాటకానికి కేంద్రంగా మారుతుందన్న సూచనలు కనిపిస్తున్నాయి..ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళకు దేశంలోనే కాకుండా ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. దేశంలోని మతపరమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు యేటా మిలియన్ల మంది పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల నుంచి దేశంలోని ఆధ్యాత్మిక కార్యక్రమాకు తరలి వస్తున్న

పర్యాటకుల్లో 21.4 శాతం పెరుగుదల కనిపిస్తుంది. ప్రముఖ వీసా ప్రాసెసింగ్ ప్లాట్‌ఫాం అట్లీస్ నివేదికల ప్రకారం.. దాదాపు 48 శాతం ఆధ్యాత్మిక ప్రయాణ వీసా అప్లికేషన్లు మహా కుంభ్ వంటి పెద్ద ఈవెంట్‌లు, తీర్థయాత్రలకు లింక్ చేసినట్లు వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న మహా కుంభమేళా.. ప్రపంచంలోని అతిపెద్ద మతపరమైన కార్యక్రమాల్లో ఒకటి. 42 మిలియన్ల మంది యాత్రికులు కుంభ్ మేళాకు వస్తారని అంచనా. 144 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ కార్యక్రమం దేశీయ, అంతర్జాతీయ సందర్శకులకు, భక్తులకు బాగా కనెక్ట్ అయ్యింది. దీంతో జా, జఐ వంటి దేశాల నుంచి కూడా ఆధ్యాత్మిక పర్యాటకుల సంఖ్య కూడా ఎన్నో రెట్లు పెరిగింది. వీరిలో మంది ప్రామాణికమైన, జీవితాన్ని మార్చే అనుభవాల కోసం అన్వేషిస్తున్నారు. సహస్రాబ్ది ఆధ్యాత్మిక యాత్రికులలో 66? మంది మహిళలు ఈ మార్పుకు నాయకత్వం వహిస్తున్నారు. సాంప్రదాయ పర్యాటక కార్యకలాపాల కంటే ఆధ్యాత్మిక, అర్ధవంతమైన ఈవెంట్ల కోసం ఎక్కువ మంది యువత సెలవులను కేటాయిస్తున్నారు. ఆధ్యాత్మిక పర్యాటకంలో కనిపించిన ఈ కొత్త ట్రెండ్.. గ్రూప్ ట్రావెల్ పట్ల ఆసక్తిని పెంచుతోంది. సమూహ ఆధ్యాత్మిక అనుభవాల కోసం ఇన్‌బౌండ్ ప్రయాణం కోసం ఏకంగా అప్లికేషన్లు 35 శాతం పెరిగాయట. గ్రూప్ టూరిజంలో భాగంగా పర్యాటకులు పవిత్ర ప్రదేశాలను సందర్శించినప్పుడు.. అక్కడి ఆచారాలలో పాల్గొనేందుకు అసక్తి చూసుతున్నారు. ముఖ్యంగా భారత్ ఆధ్యాత్మిక పర్యాటకం గత కొన్నేళ్లుగా బాగా పుంజుకుంది. వారణాసి, రిషికేశ్ వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలు ఈ జాబితాలో ముందున్నాయి. ఇక్కడకు ప్రతి యేట మిలియన్ల మంది విదేశీ పర్యాటకులు వస్తుంటారు. గంగానది పక్కన ధ్యానం చేయడానికి, సాయంత్రం హారతి చూడటానికి అమితాసక్తి కనబరుస్తున్నారు. ఆధ్యాత్మిక పర్యాటకం అభివృద్ధికి అధికారులు కూడా తీర్థయాత్రల చుట్టూ ఉన్న మౌలిక



సదుపాయాలు, వసతిని అప్‌గ్రేడ్ చేశారు. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల నుంచి ఆధ్యాత్మిక అన్వేషకులను స్వాగతించడానికి, మరిన్ని అనుభూతులను అందించడానికి భారత ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది. మహా కుంభ్ వంటి అరుదైన కార్యక్రమాలకు రికార్డు స్థాయిలో పర్యాటకులను ఆకర్షించడం, దాని ఆధ్యాత్మిక వారసత్వంపై పెరుగుతున్న ప్రపంచ ఆసక్తి వల్ల.. భారత్ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మారనుంది.

# దళిత ఓట్లపై ప్రధాన పార్టీల గురి

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్ పార్టీల మధ్య త్రిముఖ పోరు జరగబోతోంది. ఓటర్లను ఆకర్షించేందుకు మూడు ప్రధాన పార్టీలు పోటీపడి ఓటర్లపై హామీలు గుప్పిస్తున్నాయి. ముఖ్యంగా ఈ ఎన్నికల్లో కీలకంగా మారే దళిత ఓటర్లపై మూడు పార్టీలు ప్రత్యేకంగా దృష్టిసారించాయి. దాంతో ఈసారి ఢిల్లీలో దళితుల ఓట్లు మూడు పార్టీల మధ్య చీలిపోయే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో 12 ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలు ఉన్నాయి. అంతేగాక మరో 30 నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను నిర్ణయించే స్థాయిలో దళితుల ఓట్లు ఉన్నాయి. ఢిల్లీలో గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ దళిత ఓటర్లు బీజేపీ వైపే మొగ్గుచూపారు. ఆప్ రెండు పర్యాయాలు వరుసగా అధికారంలోకి రావడంలో దళితుల ఓట్లు కీలకపాత్ర పోషించాయి. అయితే రెండు సార్లు ఆప్‌కు అధికారం కట్టబెట్టినా దళితుల జీవితాల్లో పెద్దగా మార్పు రాలేదు. దాంతో దళితుల్లో కొందరు ప్రస్తుతం ఆప్‌పై అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో ఆప్‌కు దళితుల మద్దతు తగ్గే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు, సబాల్టర్న్ మీడియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ కుశ్ అంబేద్కర్?వాదీ చెప్పారు. ఇక బీజేపీకైతే ఢిల్లీలో ఎప్పుడూ దళితుల ఆదరణ లభించలేదు. అందుకే 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 12 ఎస్సీ నియోజకవర్గాల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా బీజేపీ గెలుచుకోలేకపోయింది.

అంతకుముందు జరిగిన ఎన్నికల్లో కూడా బీజేపీ 2-3 సీట్లతో మాత్రమే సరిపెట్టుకుంది. దాంతో ఈసారైనా దళిత ఓటర్ల మనసు గెలువాలని ఆ పార్టీ ప్రణాళిలు సిద్ధం చేస్తోంది. దళితులను ఆకర్షించేందుకు అనేక వ్యూహాలను రచిస్తోంది.



వారిని ఊరించే హామీలు గుప్పిస్తోంది. దళిత మెజారిటీ నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దళితుల ఓట్లను ఆకర్షించేందుకు గత కొన్ని నెలలుగా బీజేపీ ఎస్సీ మోర్చా ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. ఇదిలావుంటే ఆప్‌పై దళిత ఓటర్లు అసంతృప్తిగా ఉండటంతో తమకు ఎస్సీ నియోజకవర్గాలు కలిసి వస్తాయని కాంగ్రెస్ పార్టీ లెక్కలు వేస్తోంది. కానీ దళిత ఓటర్లను ఆకర్షించడంలో మాత్రం కాంగ్రెస్ ఆలస్యం చేస్తోంది. ఈ విషయాన్ని గత ఏడాది ఆప్ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి రాజేంద్ర పాల్ గౌతమే స్వయంగా చెప్పారు. దళిత ఓటర్లను ఆకర్షించేలా ముందే ప్రచారం ప్రారంభించి ఉంటే మరింత మద్దతు పొందేవాళ్లమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో ఆప్‌కు దళితుల్లో ఆదరణ తగ్గినప్పటికీ మెజారిటీ దళిత ఓటర్లు ఆప్ వైపే మొగ్గే అవకాశం కనిపిస్తున్నది. ఎందుకంటే బీజేపీపై ఢిల్లీ దళితుల్లో అనాదిగా సదభిప్రాయం లేకపోవడం, కాంగ్రెస్ పార్టీ దళితులను ఆకర్షించడంలో విఫలం కావడం లాంటి పరిణామాలు ఆప్‌కు కలిసివచ్చేలా ఉన్నాయి. మూడు పార్టీలను పోల్చి చూస్తే తమకు ఆపే బెటర్ అనే ఆలోచనలో మెజారిటీ దళితులు ఉన్నారు.

## మహారాష్ట్రలో భారీ పేలుడు
## ఐదుగురు మృతి..



మహారాష్ట్రలో భారీ పేలుడు సంభవించింది. భండార జిల్లాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పేలుడు జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు దాటికి ఫ్యాక్టరీ పైకప్పు కుప్పకూలిపోయింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. నాగ్ పూర్ డిఫెన్స్ పిఆర్వో ఈ పేలుడు ఘటనపై అధికారిక ప్రకటన చేశారు. పేలుడుకు గల కారణాలపై విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కావడంతో తీవ్రత ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీలోచాలా మంది చిక్కుకుపోయారు. అందులో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని భండార జిల్లా కలెక్టర్ సంజయ్ కోల్టే డాక్టర్లను ఆదేశించారు.ఇప్పటివరకు మొత్తం పద్నాలుగు మందిని రక్షించినట్లు కలెక్టర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఐదుగురు వర్కర్లు చనిపోయారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పేలుడు శబ్దం దాదాపు 5 కిలోమీటర్ల దూరం వినిపించిందని చెప్పారు. భారీగా పొగ, మంటలు ఎగిసిపడుతున్నాయి. ఈ దృశ్యాలను దూరాన ఉన్న కొందరు తమ కెమెరాల్లో బంధించారు. కాగా భండారాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పేలుడు ఘటనపై మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే స్పందిస్తూ.. "ఇది మోదీ ప్రభుత్వ వైఫల్యం" అని అన్నారు.

# మద్యం ప్రియులకు షాకింగ్ న్యూస్

మధ్యప్రదేశ్‌లో మద్య నిషేధం మొదటి నుండి పెద్ద సమస్యగా మారింది. దీనిపై అధికార పక్షంతోపాటు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. 2023లో రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మద్య నిషేధం అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికలు ముగిసిన ఒక సంవత్సరం తర్వాత, రాష్ట్రంలోని మోహన్ యాదవ్ ప్రభుత్వం శుక్రవారం(జనవరి 24) రాష్ట్రంలోని 17 ప్రధాన నగరాల్లో మొదటి దశలో మద్యాన్ని నిషేధించాలని నిర్ణయించింది. ఇందులో ఉజ్జయిని మున్సిపల్ కార్పొరేషన్ కూడా ఉంది. ప్రభుత్వ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వివరిస్తూ, రాష్ట్రాన్ని మద్య నిషేధ రాష్ట్రంగా మార్చేందుకు తొలి అడుగుపడిందన్నారు. ఇందులో భాగంగా తొలుత 17 మతపరమైన పట్టణాలలో మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్లు సీఎం మోహన్ యాదవ్ ప్రకటించారు. మునిసిపల్ కార్పొరేషన్ ఉజ్జయినితో పాటు, మునిసిపల్ కార్పొరేషన్ మెహర్, డాటియా, పన్నా, మాండ్లా, ముల్తాయ్, మందసౌర్, నగర పంచాయతీ ఓర్చా, చిత్రకూట్, అమర్‌కంటక్, మహేశ్వర్, ఓంకారేశ్వర్, మండలేశ్వర్ వంటి నగరాల్లో మద్యం దుకాణాలు మూసివేయనున్నట్లు సీఎం చెప్పారు. గ్రామ పంచాయతీలో సల్కాన్‌పూర్, బండక్‌పూర్, కుందల్‌పూర్, బర్మన్ కాలా, లింగ, బర్మన్ ఖుర్ద్ గ్రామాల్లో మద్య నిషేధం విధిస్తున్నట్లు సీఎం మోహన్ యాదవ్ స్పష్టం చేశారు. మహేశ్వరంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం మోహన్ యాదవ్ తెలిపారు. ఈ సమావేశంలో మద్యపాన నిషేధంపై నిర్ణయం తీసుకున్న తర్వాత ఈ నిర్ణయాన్ని సీఎం ప్రకటించారు. ఈ సమావేశం




గురించి సీఎం మీడియాతో మాట్లాడుతూ.. మద్య నిషేధ నిర్ణయాన్ని వివరిస్తూ.. అయా నగరాలు లేదా గ్రామ పంచాయతీల్లో మద్యం షాపులను మూసివేయాలని నిర్ణయించిన చోట వాటి స్థానంలో ఇతర షాపులు తెరవబోమని చెప్పారు. శాశ్వతంగా మూసివేయడం జరుగుతుందన్నారు. మద్య నిషేధం ప్రకటించిన చాలా ప్రదేశాలు మత స్థలాలు అని సీఎం అన్నారు. నర్మదా నడి ఒడ్డుకు ఇరువైపులా 5 కిలోమీటర్ల విస్తీర్ణంలో మద్యపాన నిషేధం, మునుపటి విధానాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూ దానిని కొనసాగిస్తామన్నారు. ఈ విధానంలో ఎలాంటి మార్పు ఉండదన్న సీఎం.. క్రమంగా రాష్ట్రాలు నిషేధం వైపు వెళ్లాలని నిర్ణయించుకున్నామని తెలిపారు.

## పాల ధరలను తగ్గించిన అమూల్



దేశంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తి సంస్థ 'అమూల్' కీలక నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా పాల ధరలను తగ్గించింది. ఈ విషయాన్ని గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జయేన్ మెహతా శుక్రవారం ప్రకటించారు. అమూల్ గోల్డ్, అమూల్ తాజా, అమూల్ టీ స్పెషల్ పాలపై రూ.1 చెప్పున తగ్గించినట్లు వెల్లడించారు. ఈ తగ్గింపు లీటర్ ప్యాక్‌కు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. తాజా నిర్ణయంతో లీటర్ అమూల్ గోల్డ్ పాల ధర రూ.66 నుంచి రూ.65కి తగ్గింది. అమూల్ టీ స్పెషల్ మిల్క్ లీటర్ ప్యాకెట్ ధర రూ.62 నుంచి రూ.61కి, అమూల్ తాజా పాల ధర లీటరుకు రూ.54 నుంచి రూ.53కి తగ్గింది. ఇన్ని రోజులూ అధిక పాల ధరలతో ఇబ్బంది పడుతున్న వినియోగదారులకు.. తాజా నిర్ణయంతో కాస్త ఊరట లభించినట్లైంది. కొత్త ధరలు వెంటనే అమల్లోకి వస్తాయని సంస్థ ప్రకటించింది. కాగా, అమూల్ చివరిసారిగా గతేడాది జూన్‌లో పాల ధరలను లీటరుకు రూ.2 పెంచిన విషయం తెలిసిందే.

## జైల్లో ఉన్నప్పుడు నాకు సీఎం పదవి ఆఫర్ చేశారు..
## బీజేపీపై సిసోడియా సంచలన ఆరోపణలు




భారతీయ జనతాపార్టీపై ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను తీహార్ జైల్లో ఉన్న సమయంలో బీజేపీ తనకు ముఖ్యమంత్రి పదవి ఆఫర్ చేసిందని ఆరోపించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఓ జాతీయ మీడియాతో సిసోడియా మాట్లాడుతూ.. జైల్లో తాను ఇబ్బందులు పడుతున్న విషయం బీజేపీకి అర్థమైందన్నారు. దానికి తోడు తన భార్య అనారోగ్యం బారినపడటం, కుమారుడు చదువుకుంటున్నాడని తెలిసి వాళ్లు తనకు బీజేపీలో చేరాలంటూ ఆఫర్ ఇచ్చినట్లు చెప్పారు. అలా చేస్తే ఆప్ కూటమిని విచ్ఛిన్నం చేస్తామని, ఆ తర్వాత తనను సీఎంను చేస్తామని బీజేపీ నేతలు చెప్పినట్లు సిసోడియా వివరించారు. దీనికి అంగీకరించకుంటే సుదీర్ఘకాలంపాటు జైల్లోనే ఉండాల్సి వస్తుందని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. 'కేజ్రీవాల్‌ను వదిలెయ్.. లేదంటే జైల్లోనే మగ్గిపో..' అంటూ అల్టిమేటం జారీ చేశారని సిసోడియా ఆరోపించారు. ఇతర పార్టీల నేతలను కొనుగోలు చేయడమే బీజేపీ విధానమని ఈ సందర్భంగా సిసోడియా ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రజల అవసరాలతో వారికి ఎటాంటి పట్టింపులూ ఉండవని వ్యాఖ్యానించారు. కేవలం అధికారం కోసమే ఆరాటపడుతున్నారన్నారు. వారి మాట వినకుంటే తప్పుడు కేసులతో జైలుకు పంపుతారని దుయ్యబట్టారు. కాగా, ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో సిసోడియా 2023లో అరెస్టైన విషయం తెలిసిందే. దాదాపు 17 నెలల పాటు ఆయన తీహార్ జైల్లో ఉండాల్సి వచ్చింది. గతేడాది సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బయటకు వచ్చారు. ఇక వచ్చే నెల 5న ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సిసోడియా జాంగ్‌పురా నుంచి పోటీ చేస్తున్నారు.

## 76వ గణతంత్ర వేడుకలకు ముఖ్యఅతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు..
# భారత్‌లో 3 రోజుల పర్యటన

**న్యూఢిల్లీ :** ఆదివారం జరిగే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ క్రమంలో ఆయన గురువారం రాత్రికి భారత్‌కి వచ్చారు. ఇండోనేషియా దేశాధినేత భారత్ పర్యటనకు రావడం ఇదే తొలిసారి. ఇతర అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా సుబియాంటో ముఖ్య అతిథిగా గణతంత్ర దినోత్సవ వేడులకల్లో హాజరుకానున్నారు. ఇండోనేషియా అధ్యక్షుడి సుబియాంటోకి కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గెరిటా విమానాశ్రయంలో స్వాగతం పలికారు. మొదటి పర్యటనలో భాగంగా న్యూ ఢిల్లీకి చేరుకున్నందుకు సుబియాంటోకి హృదయపూర్వక స్వాగతం అంటూ %వీజూా% ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ పర్యటన భారత్-ఇండోనేషియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు. మొత్తం మూడు రోజుల పర్యటనతో సుబియానాటో.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్, ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌లతో వరుస సమావేశాలను నిర్వహించనున్నారు. రెండు దేశాలు రాజకీయాలు, రక్షణ, భద్రత, వాణిజ్యంతో సహా పలు రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించుకోనేందుక పలు కీలక ఒప్పందాలను కుదుర్చుకోవాలని భావిస్తున్నారు. రెండు దేశాల మధ్య అవగాహన ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. అంతేకాకుండా సుబియాంటో పర్యటన సందర్భంగా 3వ సీఈవో ఫోరమ్ కూడా జరగనుంది. ఇక సుబియాంటో.. భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరైన నాల్గవ ఇండోనేషియా అధ్యక్షుడు. 1950లో జరిగిన భారత తొలి గణతంత్ర వేడుకలకు ఇండోనేషియా తొలి అధ్యక్షుడు సుకర్ణో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇండోనేషియా నుండి 352 మంది సభ్యులతో కూడిన కవాతు, బ్యాండ్ బృందం ఇక్కడ



జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొననుంది. ఇండోనేషియా కవాతు, బ్యాండ్ బృందం విదేశాల్లో జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ప్రధాని మోదీ 2018లో ఇండోనేషియాకు వెళ్లారు. ఆ సమయంలో భారత్-ఇండోనేషియా సంబంధాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి చేరుకున్నాయి. జనవరి 24న సాయంత్రం 4:00 గంటలకు తాజ్ మహల్ హెూటల్‌లో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో భేటీ. జనవరి 25న, ఉదయం 10:00 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ఉత్సవ రిసెప్షన్‌లో పాల్గొంటారు. ఆ తర్వాత రాజ్‌ఘాట్‌లో పుష్పగుచ్ఛం ఉంచుతారు. అదే రోజు మధ్యాహ్నం 12:00 గంటలకు హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన సమావేశం కానున్నారు. ఇందులో అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు), పత్రికా ప్రకటనలు ఉంటాయి. సాయంత్రం 4:00 గంటలకు తాజ్ మహల్ హెూటల్‌లో ఉపాధ్యక్షుడు జగదీప్ ధన్‌ఖర్‌తో సమావేశమవుతారు. రాత్రి 7:00 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అవుతారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరవుతారు. మధ్యాహ్నం తర్వాత రాష్ట్రపతి భవన్‌లో అధ్యక్షుడు ముర్ము ఏర్పాటు చేసిన 'ఎట్ హెూమ్' రిసెప్షన్‌లో పాల్గొంటారు. సాయంత్రం 5:30 గంటలకు ఆయన ఇండోనేషియాకు తిరిగి బయలుదేరతారు.

## మూడు పాఠశాలలకు బాంబు బెదిరింపులు..
## భయాందోళనలో విద్యార్థులు




దేశంలో బాంబు బెదిరింపులు మరోసారి కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల క్రితం తమిళనాడులోని రెండు పాఠశాలలకు, నిన్న ముంబైలోని ఓ పాఠశాలకు ఇలాంటి బెదిరింపులే వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా గుజరాత్ రాష్ట్రంలోని మూడు పాఠశాలలకు బెదిరింపులు వచ్చాయి. వడోదరలోని నవరచన స్కూల్ సహా మొత్తం మూడు పాఠశాలలకు శుక్రవారం ఉదయం ఈ బెదిరింపులు వచ్చాయి. దుండగులు ఈమెయిల్ ద్వారా ఈ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ బెదిరింపు మెయిల్‌తో అప్రమత్తమైన ఆయా పాఠశాలల యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు పాఠశాలల్లోని విద్యార్థులను, సిబ్బందిని వెంటనే బయటకు పంపించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాల సాయంతో ఆయా పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ కనిపించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న వడోదర పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ది ఫ్యామిలీ మ్యాన్-3




ఓటీటీ ప్రియులకు పరిచయం అక్కర్లేని వెబ్ సిరీస్‌లలో 'ది ఫ్యామిలీ మ్యాన్' ఒకటి. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి లీడ్ రోల్‌లో నటించిన ఈ సిరీస్ రెండు భాగాలుగా వచ్చి అమెజాన్ ప్రైమ్‌లో రికార్డులు నమోదు చేసింది. స్పై, థ్రిల్లర్‌గా వచ్చిన ఈ సిరీస్‌ను దర్శకద్వయం రాజ్ డీకే తెరకెక్కించారు. ఈ వెబ్ సిరీస్ షూటింగ్ గత ఏడాది మేలో ప్రారంభమైన విషయం తెలిసిందే. తాజాగా ఈ సిరీస్ షూటింగ్ కంప్లీట్ చేసుకున్నట్లు రాజ్ డీకే ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ మ్యాన్ టీమ్‌తో దిగిన ఫొటోలను పంచుకున్నారు. ఈ ఫొటోలలో సమంత కూడా ఉండడం విశేషం. ఫస్ట్ సీజన్ టెర్రరిజం బ్యాక్‌డ్రాప్‌లో రాగా.. సెకండ్ సీజన్ శ్రీలంక రెబల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చి హిట్ అందుకుంది. ఇక సెకండ్ సీజన్‌లో సమంత లీడ్ రోల్‌లో నటించడం విశేషం. అయితే 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' ఎక్కడైతే పూర్తైందో అక్కడి నుంచే 'ది ఫ్యామిలీ మ్యాన్ 3' మొదలవుతుందని మేకర్స్ తెలిపారు. సీజన్ 3 ఎక్కువగా నార్త్ ఈస్ట్ ఇండియాలో బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్నట్లు ప్రకటించింది. శ్రీకాంత్ తివారీ (మనోజ్ బాజ్‌పాయ్) పిల్లలు పెద్దవాళ్లు అవుతారు. ఆయనకు వయసు పెరిగినా సవాళ్లు వెంటాడుతూనే ఉంటాయి. అయితే ఈ సవాళ్లను శ్రీకాంత్ ఎలా ఎదుర్కొన్నాడనేది తెలియాలంటే సీజన్ 3 వచ్చేవరకు ఆగాల్సిందే.



# కాలేజీలకు డుమ్మాకొట్టి ఆడిటోరియంలకు వెళ్లేదాన్ని

## : సాయిపల్లవి

తెలుగు, తమిళం, మలయాళ, హిందీ భాషల్లో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న నటీమణుల్లో ఒకరు సాయిపల్లవి. ఈ భామ తాను చదువుకున్న కోయంబత్తూరులోని ఎవిలా స్కూల్ వార్సికోత్సవాన్ని ముఖ్యఅతిథిగా హాజరైంది. ఈ సందర్భంగా తన చిన్ననాటి జ్ఞాపకాలను షేర్ చేసుకుంది. ఈవెంట్‌లో సాయిపల్లవి మాట్లాడుతూ.. నేనిక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది. కేవలం నా జ్ఞాపకాల వల్ల మాత్రమే కాదు.. నా స్కూల్ టైంలో ఎక్కువగా ఈ ఆడిటోరియంలోనే ఉండేదాన్ని. క్లాస్‌కు డుమ్మా కొట్టి.. ఇక్కడికొచ్చి డ్యాన్స్ చేసేదాన్ని. నేను చాలా ఇంటెలిజెంట్ స్టూడెంట్‌నని మీరనుకుంటున్నారని నాకు తెలుసు. నేను కేవలం అటెండెన్స్ ఇచ్చేసి.. ఇక్కడే రోజంతా ప్రాక్టీస్ చేసేదాన్ని. కానీ అప్పుడు నాకా విషయం తెలియదు.. నాకిప్పుడు తెలిసిందేంటంటే.. నిజానికి నేనేం చేస్తున్నానో టీచర్లకు బాగా తెలుసు. వాళ్లు అలా చేయడం వల్ల చాలా యంగ్ ఏజ్‌లోనే నాకు స్టేజ్ ఫియర్ పోయింది. నేనిక్కడి దాకా వచ్చేందుకు నాకు సపోర్ట్‌గా నిలిచారంటూ చెప్పుకొచ్చింది. సోషల్ మీడియాలో ఆందోళన కలిగించే విషయాలు చాలా ఉన్నాయి. నేను చిన్నప్పుడు ఉన్నదానికంటే ఇప్పుడు చాలా ఎక్కువ విషయాలు మన దృష్టి మరల్చుతున్నాయి. మీరు నిజంగా ఎవరో తెలుసుకోవడానికి మీతో మీరు సంభాషించుకోవాలని సూచించింది సాయిపల్లవి. ఇష్టంగా డ్యాన్స్ చేయడం, మెడిసిన్ చేయడం, మంచి మనిషిగా ఉండటం అంటే ఏమిటో తెలుసుకోవడం, క్రమశిక్షణ వల్ల నాకు లభించిన ప్రతిదాన్ని నేను పొందుతాను. పిల్లలతో నా పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఈ ఏడాది చివరలో మళ్లీ స్కూల్‌కు వస్తాను.. అని చెప్పింది సాయిపల్లవి.

# ప్రతిదాన్ని చివరిగా భావించే దశలో ఉన్నా

## : సమంత



తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న భామల్లో స్టార్ నటి సమంత ఒకరు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో వచ్చిన సిటాడెల్ వెబ్ ప్రాజెక్ట్‌తో బిజీగా మారిన ఈ బ్యూటీ.. విడుదల తర్వాత రిలాక్సేషన్ మూడ్‌లోకి వెళ్లిపోయింది. ఇప్పుడు మళ్లీ చాలా కాలం తర్వాత బిజీగా మారిపోయారు. వరుస ఈవెంట్స్‌లో పాల్గొంటూ అభిమానులను అలరిస్తున్నారు. అయితే, జీవితంలో ప్రతి దాన్ని చివరిదిగా భావించే దశలో తాను ఉన్నానని సామ్ తాజాగా తెలిపారు. ఈ మేరకు ఓ ఆంగ్ల మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా సామ్ మాట్లాడుతూ.. సాధారణంగా ఉండే సినిమాలను ఎన్నో అంగీకరించొచ్చన్నారు. తాను మాత్రం కచ్చితంగా ప్రేక్షకులపై ప్రభావాన్ని చూపే వాటినే ఎంపిక చేసుకుంటున్నట్లు తెలిపారు. వంద శాతం నమ్మితేనే ఆ పాత్రలను చేస్తానని, లేకపోతే చేయలేనని తెలిపారు. సవాలుగా అనిపించే పాత్రలనే ఎంపిక చేసుకుంటున్నట్లు వెల్లడించారు. రాజ్ అండ్ డీకే ఎక్కువగా సవాలుగా అనిపించే పాత్రలనే రూపొందిస్తున్నారని.. వారితో వర్క్ చేయడం తనకు ఎంతో సంతృప్తిగా ఉంటుందని సామ్ చెప్పుకొచ్చారు. గొప్ప సినిమాలో నటించాననే ఫీల్ రాకపోతే వర్క్ చేయలేనని సామ్ వివరించారు. విజయ్ దేవరకొండతో చివరగా ఖుషి సినిమాలో నటించింది సమంత. ఈ సినిమా తర్వాత తెలుగులో మళ్లీ కొత్త ప్రాజెక్టు ప్రకటించలేదు. ప్రస్తుతం తన కొత్త వెబ్ సిరీస్ %ఘున్ దీథ్పుఖఅం% వెబ్ సిరీస్ షూట్‌లో జాయిన్ అయింది.



# ఏదీ రాసుకుంటారో రాసుకోండి

## : సారా అలీఖాన్

బాలీవుడ్ నటి, సైఫ్ అలీ ఖాన్ కూతురు సారా అలీ ఖాన్ ఎప్పుడు హాట్ టాపిక్ గా నిలుస్తుంటుంది. ఆమె నటన పరంగా పర్వాలేదు. సోషల్ లైఫ్ లో మాత్రం అల్వేస్ ట్రెండింగ్. ఆమె జెన్ జీ నటి. ఆమె బిహేవియర్ కూడా అలాగే ఉంటుంది. పార్టీస్, ఫ్రెండ్స్, ట్రిప్స్, యాక్సెంట్ అని డిఫరెంటే. అయితే ఆమె ట్రిప్స్ కు రెగ్యులర్ వెళ్లే విషయం అందరికి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆమె డేటింగ్ లైఫ్ పై అనేక వార్తలు ప్రచారం అవుతుంటాయి. మరి తాజాగా ఓ ఆసక్తికర ఘటన జరిగింది. అదేంటంటే..సారా అలీ ఖాన్ ఎంత పెద్ద మహాశివుడి భక్తురాలో ఆమె ఫాలోయర్స్ కి బాగా తెలుసు. ఆమె తరుచుగా కేదార్నాథ్ ఆలయాన్ని సందర్శించే విషయం తెలిసిందే. ఇటీవలే ఏపీలోని శ్రీశైల మల్లిఖార్జున స్వామిని కూడా దర్శించుకున్నారు. ఇదంతా పక్కనా పెడితే.. ఆమె యాక్టర్ అరుణ్ బజ్వా ప్రతాప్ తో కేదార్నాథ్ వెళ్లిన ఫోటోలు ఇంటర్నెట్ లో సంచలనం సృష్టించాయి. వీళ్లిద్దరు స్నేహితులు మాత్రమే కాదు డేటింగ్ లో ఉన్నారని గుసగుసలు వినిపించాయి. ఇది ఇలా ఉండగానే రాజస్థాన్ లో వీరిద్దరూ ఒకే ప్రదేశంలోని ఫోటోలని వేరువేరుగా షేర్ చేశారు. దీంతో ఈ వార్తలకు మరింత ఊపు వచ్చింది. ఈ నేపథ్యంలోనే అర్జున్ బజ్వా మరింతా ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం వైరల్ గా మారింది. ఆయన ఏమన్నారంటే. రీసెంట్ గా బజ్వా, సారాల రిలేషన్షిప్ గురించి అనేక వార్తలు ప్రచారం అవుతున్నాయి. దీనిపై బజ్వా స్పందిస్తూ..”ఎవరు ఏది రాయాలి అనుకుంటే అది రాస్తారు. అది వారి డ్యూటీ. ఎవరు చేయాల్సిన పనిపై వారు దృష్టి సారించడం మంచిదే. నేను కూడా నేను చేయాల్సిన పనిపై దృష్టి సారిస్తున్న” అన్నారు. దీంతో కొందరు ఆ జంటకు ప్రైవసీ ఇవ్వాలని అభిప్రాయాలూ వ్యక్తం చేస్తుంటే. మరికొందరు ఆయన వార్తలను ఖండించలేదు కాబట్టి.. వాళ్లిదరు డేటింగ్ లో ఉన్నా వార్తలు నిజమే అంటూ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# కాంచన 4లో ఆ ఇద్దరు హీరోయిన్లకు ఛాన్స్



హార్రర్ కామెడీ జోనర్ సినిమాలకు దక్షిణాదితోపాటు ఉత్తరాది ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉంటుందని తెలిసిందే. ఇదే జోనర్‌లో సూపర్ క్రేజ్ సంపాదించుకున్న ఫ్రాంఛైజీ కాంచన. టాలెంటెడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ రాఘవా లారెన్స్ కాంపౌండ్ నుంచి ఈ ఫ్రాంఛైజీలో ఇప్పటికే మూడు పార్టులు రాగా.. ఇప్పుడిక కాంచన 4 టైం కూడా వచ్చేసింది. ఈ చిత్రంలో పూజాహెగ్డే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని ఇప్పటికే వార్తలు కూడా వచ్చాయని తెలిసిందే. అంతేకాదు బీటౌన్ డ్యాన్సింగ్ క్వీన్ నోరా ఫతేహి కూడా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తుందని మరో అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ విషయాన్ని నిర్మాత మనీశ్ షా ప్రకటించాడు. ఈ చిత్రాన్ని గోల్డ్ మైన్ ఫిలిమ్స్ తెరకెక్కించనుంది. ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణులను ఫైనల్ చేయాల్సి ఉందని ఇప్పటికే ఓ చిట్‌చాట్‌లో చెప్పాడు మనీశ్ షా. కాంచన 4 జనవరి లేదా ఫిబ్రవరి 2025లో సెట్స్‌పైకి వెళ్లనుందని.. హిందీ, తమిళం, తెలుగు, మలయాళ భాషల్లో తెరకెక్కించబోతున్నామని చెప్పారు. ఈ మూవీ రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో రాబోతుందని ఇన్‌సైడ్ టాక్. కాంచన 4 గురువారం ప్రారంభమైంది. థియేటర్లలో విడుదలైన ఎనిమిది వారాల తర్వాత డిజిటల్ విడుదల అవుతుందని మనీష్ షా స్పష్టం చేశారు. హిందీ వెర్షన్ కూడా జాతీయ స్థాయిలో విడుదలవుతుందన్నారు



# దోమకొండ గడికోట ఆలయంలో ప్రియాంక చోప్రా ప్రత్యేక పూజలు

మొన్న చిలుకూరు బాలాజీ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసిన నటి ప్రియాంక చోప్రా... ఈరోజు కామారెడ్డి జిల్లాలోని దోమకొండ గడికోట సుప్రసిద్ధ మహాదేవుని ఆలయానికి వెళ్లారు. హైదరాబాద్ నుంచి ఇవాళ ఉదయం కారులో దోమకొండకు చేరుకున్నారు. గడికోటకి వచ్చిన బాలీవుడ్ నటికి ట్రస్ట్ సభ్యులు, ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో కొలువుదీరిన సోమసూత్ర శివలింగానికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారామె. ఇందుకు సంబంధించిన వీడియోను ప్రియాంక తన ఇన్‌స్టా స్టోరీస్‌లో అభిమానులతో పంచుకున్నారు. ఇప్పుడీ వీడియో వైరల్ అవుతోంది. ఇదిలాఉంటే.. అమెరికన్ పాప్ సింగర్ నిక్ జోనాస్‌ను పెళ్లి చేసుకున్న తర్వాత ఈ బాలీవుడ్ ముద్దుగుమ్మ హాలీవుడ్‌లోనే మకాం వేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల ఆమె టొరంటో నుంచి హైదరాబాద్‌లో దిగారు. దీనికి కారణం సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబోలో తెరకెక్కున్న ఎస్ఎస్ఎంబీ 29 ప్రాజెక్టులో ఆమె భాగం కానున్నారట. ఈ మూవీలో హీరోయిన్‌గా ప్రియాంకను తీసుకున్నారని బీటౌన్ సర్కిల్ టాక్. కాగా, దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది.

# దిల్ రాజు ఇంట్లో కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్న ఐటీ అధికారులు



సినీ పరిశ్రమకు సంబంధించి ప్రస్తుతం జరుగుతున్న అతి పెద్ద చర్చ ఏమిటంటే... ఫేక్ కలెక్షన్స్! మా సినిమాకు వందల కోట్లు వచ్చాయంటూ మేకర్స్ సోషల్ మీడియాలో ప్రకటిస్తున్నారు. ఈ కలెక్షన్స్ నిజమేనా అనేదానిపై స్పష్టత ఉండడంలేదు. ఈ క్రమంలో ఐటీ అధికారులు టాలీవుడ్ ప్రముఖులపై పడ్డారు. కలెక్షన్లు ఎంత వచ్చాయి? దానికి తగ్గట్టుగా లెక్కలు చూపించారా? అనే కోణంలో రెయిడ్స్ చేస్తున్నారు. గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాల నిర్మాత దిల్ రాజు నివాసం, కార్యాలయంలో వారు సోదాలు జరిపారు. నాలుగు రోజుల ఐటీ సోదాల్లో దిల్ రాజుకు సంబంధించిన పలు కీలక అంశాలను ఐటీ అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఆయన ఇంట్లో కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఐటీ టీమ్ ప్రస్తుతం లీగల్ ఫార్మాలిటీస్ పూర్తి చేస్తున్నట్టు సమాచారం. దిల్ రాజు కూతురు హన్సితా రెడ్డి ఇంట్లో కూడా డాక్యుమెంట్లను అధికారులు వెరిఫై చేస్తున్నారు. అటు, పుష్ప-2 సినిమాకు సంబంధించి రూ. 1,800 కోట్లకు పైగా ఆదాయం వచ్చినట్టు మేకర్స్ ప్రకటించారు. కానీ దానికి తగినట్టుగా పన్నుల చెల్లింపులు జరిగినట్టు ఐటీ అధికారులు గుర్తించారు. నాలుగు రోజులుగా 18 ప్రదేశాల్లో ఐటీ అధికారులు 55 బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు.